విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :53 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | గురువారం 16 జూలై 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## ముగిసిన ముద్రగడ అంతమయాత్ర

ముద్రగడ పద్మనాభం అంతిమయాత్రలో పాడె మోసిన జగన్

కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పిన జగన్



## చంద్రబాబు పాలనలో రైతులకు అవస్థలు

నేను ఉన్నాను.. మీ కష్టాలు నాకు తెలుసు

ఆక్వా రైతులకు వైయస్ జగన్ భరోసా

ఆక్వా రైతుల ముఖాముఖిలో వైయస్ జగన్

భీమవరం

చంద్రబాబు ఎప్పుడు వచ్చినా, రాష్ట్రంలో వ్యవసాయ రంగం, రైతాంగం సంక్షోభంలో కూరుకుపోతారని, ఇంకా ఆక్వా రంగం పరిస్థితి దారుణంగా మారుతుందని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. ఇప్పుడు కూడా ఏ ఒక్క పంటకూ కనీస గిట్టుబాటు ధర లేదని, మరోవైపు ఆక్వా సాగు రంగం దుర్భరస్థితిలో కొట్టుమిట్టాడుతోందని ఆయన గుర్తు చేశారు. ఒకవైపు ఆక్వా సీడ్, ఫీడ్ ధరలు దారుణంగా పెరగ్గా, మరోవైపు పంట కొనుగోలు ధరలు - మిగతా3లో

సింగపూర్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమీక్ష

ఆర్థిక వృద్ధికి కేంద్రంగా అమరావతి నిర్మాణం

అమరావతి 2.0 ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్‌పై సీఎం సమీక్ష

ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచన

ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లతో అంతర్జాతీయ స్థాయి నగరం

ప్రణాళికపై సింగపూర్ ప్రతినిధుల ప్రజెంటేషన్

## అమరావతి 2.0 మాస్టర్ ప్లాన్



అమరావతి

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ఆర్థిక ప్రగతికి చోదక శక్తిగా, ప్రపంచ స్థాయి నగరంగా అమరావతిని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని నలుమూలల నుంచి ప్రజలు వచ్చి నివసించేలా రాజధాని ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్ ఉండాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమరావతి 2.0 ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ (ఫ్రూా-2) పనుల పురోగతిపై ఆయన ఉన్నతాధికారులు, సింగపూర్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సింగపూర్ ప్రతినిధులు అమరావతి నిర్మాణానికి సంబంధించిన ప్రాజెక్టు పరిధి, అమలు ప్రణాళిక, దశలవారీ కార్యాచరణను ముఖ్యమంత్రికి వివరించారు. ఏరియా ప్లాన్, మౌలిక వసతుల కల్పన, పెట్టుబడి నమూనా వంటి కీలక అంశాలను ప్రాజెక్టులో భాగంగా చేర్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, ఉద్యోగాలు కల్పించడం ద్వారా అమరావతి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. అమరావతిని ఆర్థికంగా పరిపుష్టం చేసేలా - మిగతా3లో

## 3 సంవత్సరాలు.. 36 ప్రాజెక్టులు

- అది రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానం
- మూడేళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటన
- రూ. 35 వేల కోట్ల బడ్జెట్‌తో పనులు చేపడతామని వెల్లడి
- రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును మార్చి 2027 నాటికి పూర్తి చేస్తామని స్పష్టం
- గత ఐదేళ్లలో ప్రాజెక్టుల నిర్వహణ పూర్తిగా విఫలమైందని విమర్శలు
- కేఎల్ రావు జయంతి, పట్టిసీమ జలహారతి కార్యక్రమంలో కీలక హామీలు



అమరావతి

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలో కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గత ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నిర్వీర్యం చేయడం రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానమని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డాక్టర్ కేఎల్ రావు 124వ జయంతి వేళ, పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాకు నీటిని విడుదల చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన 'జలహారతి' - మిగతా3లో



## పోలీసుల వైఫల్యం వల్లే ఈ ఘోరం

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేఖ

షాబాద్ ఘటనపై రేవంత్ రెడ్డికి పవన్ కల్యాణ్ లేఖ

పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి

పోక్సో కేసు నిందితుడు ఆరుగురిని హత్య చేసిన వైనం

బాధితులకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని విమర్శ

## అమెరికాలో ట్రంప్ చిత్రంతో కొత్త డాలర్ నాణెం




- అమెరికా 250వ స్వాతంత్ర్య వార్షికోత్సవం సందర్భంగా కొత్త నాణెం
- ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ చిత్రంతో 1 డాలర్ నాణెం విడుదల
- దేశభక్తికి, స్వేచ్ఛకు ప్రతీకగా ఈ నాణెం అని తెలిపిన ట్రెజరీ విభాగం



## దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రక్షాళన

- ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఈసీ చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్
- నకిలీ, వలస వెళ్లిన ఓటర్లను తొలగించి, అర్హులను చేర్చడమే లక్ష్యం
- ఇప్పటికే ముగిసిన రెండు దశలు
- ఏపీ, తెలంగాణ సహా 16 రాష్ట్రాల్లో మూడో దశ సర్వే
- ఏపీలో ఇంటింటి సర్వే గడువు జూలై 24 వరకు పొడిగింపు




## మీ బ్యాంకు లావాదేవీలపై ఐటీ నిఘా

- ఈ పొరపాట్లు చేస్తే నోటీసులు ఖాయం!
- సేవింగ్స్ ఖాతాలో రూ.10 లక్షలు దాటిన నగదు డిపాజిట్లపై ఐటీ శాఖ దృష్టి
- క్రెడిట్ కార్డు బిల్లులకు రూ.10 లక్షలు దాటిన చెల్లింపులపై నిఘా
- రూ.30 లక్షలు దాటిన ఆస్తి కొనుగోలు, అమ్మకాలపై సమీక్ష
- లావాదేవీలకు, ఐటీఆర్‌కు పొంతన లేకపోతే భారీ జరిమానా ప్రమాదం

# చంద్రబాబు పాలనలో రైతులకు అవస్థలు

-మొదటిపేజీ తరువాయి

పతనమయ్యాయని చెప్పారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా.. ఇదే పరిస్థితి కొనసాగుతోందన్న ఆయన, పలు అంశాలు ప్రస్తావించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఆక్వా రైతుల ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న వైయస్ జగన్, వారికి భరోసా ఇచ్చారు. 'నేను ఉన్నాను. మీ కష్టాలు నాకు తెలుసు' అంటూ ఆక్వా రైతులకు ధైర్యం చెప్పారు. రాబోయేది తమ ప్రభుత్వమే అన్న వైయస్ జగన్, తాము రాగానే ఆక్వాలో ఇప్పుడున్న సిండికేట్‌ను కూకటివేళ్లతో సహా పెకిలించి వేస్తామని, 'అప్సడా'కు పూర్వ వైభవం తీసుకొస్తామని స్పష్టం చేశారు. భీమవరంలో ఆక్వా రైతుల ముఖాముఖి కార్యక్రమంలో వైయస్ జగన్ ఇంకా ఏం మాట్లాడారంటే.. ఈరోజు మీరు చూపిస్తున్న ఈ ఆదరణ, అభిమానానికి నిజంగా నోటిలో నుంచి మాట కూడా రానంతగా భావోద్వేగం. ఇసుక వేసినా రాలనంతగా కంటి చూపు మేరలో ఎక్కడా కూడా ఖాళీ స్థలం కనిపించనంతగా, ఈ అభిమాన తరంగాల మధ్య మీరు చూపిస్తున్న ఈ ప్రేమ, ఈ అభిమానానికి ప్రతి అక్కకు, ప్రతి చెల్లెమ్మకు, ప్రతి అవ్వకు, ప్రతి తాతకు, ప్రతి సోదరుడికి, ప్రతి స్నేహితుడికి ముందుగా రెండు చేతులు జోడించి పేరు పేరున హదయపూర్వకంగా కతజ్ఞతలు తెలుపుకుంటూ ఉన్నాను. ఈరోజు రాష్ట్రంలో పరిస్థితి గమనిస్తే లక్షన్నరకు పైగా రైతులు ఐదు లక్షలకు పైగా ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. దాదాపు 15 లక్షల మందికి ఆక్వా రంగం ఉపాధి కల్పిస్తోంది. కానీ ఈ రంగంలో పరిస్థితులు చూస్తే, మానవత్వం ఉన్న ఏ ఒక్కరికైనా కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. అంత దయనీయమైన పరిస్థితిలో ఈరోజు ఆక్వా రంగం ఉంది. ఇష్టానుసారంగా ఫీడ్ ధరలను పెంచుకుంటూ పోతున్నారు. నిజానికి ఫ్రీడ్ ధరల పెంపు అనేది రైతుల అంగీకారంతోనే జరగాలి కానీ, ఏకపక్షంగా కాదు. ఫీడ్ ధరలు పెంచాలంటే సమీక్ష జరగాలి.



అలాగే దానికి ఒక హేతుబద్ధత ఉండాలి. ధరల పెంపుపై సమీక్షించాలంటే.. ఫిష్ మీల్ సమద్ధిగా ఉండే అక్టోబరు, నవంబరు నెలల్లో, హేతుబద్ధంగా ఒక నిర్ణయం తీసుకోవాలి. అలా కాకుండా అందుబాటులో ఉన్న కారణంలో ఫీడ్ రేట్లపై ఇష్టానుసారం రివ్యూ చేయకూడదు. దీనిపైనే ఇటీవల ఆక్వా రైతాంగం తమ గోడు వెళ్లబోసుకున్నారు. అందుకే ఈ ప్రభుత్వానికి అప్పుడే అల్టిమేటం కూడా జారీ చేశాం. చంద్రబాబు ప్రభుత్వం ప్రతి అడుగులోనూ కూడా మోసం, మోసం, మోసం అనే పదాలే వినిపిస్తాయి. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు ఏ మాదిరిగా చంద్రబాబునాయుడుగారు మోసాలతో అడుగులు ముందుకు వేసాడో, ఎన్నికలప్పుడు బాండ్లు ప్రతి ఇంటికి పంపిణీ చేసి ఏ మాదిరిగా ప్రజలను మోసం చేశాడో, అదే మాదిరిగా ఆక్వా రైతులను కూడా ఆయన మోసం చేస్తూ వచ్చాడు. ఇవాళ ఈ సందర్భంగా మీ అందరికీ కూడా నేను ఒకటే హామీ ఇస్తున్నాను. 'మీ కష్టాలు నాకు తెలుసు. నేను ఉన్నాను' అని మాత్రం మీ అందరికీ చెబుతున్నాను. చూస్తుండగానే రెండేళు గడిచాయి. కళ్ళు మూసుకొని కళ్ళు తెరిచే సరికే మరో మూడేళ్లు గడుస్తాయి. ఆ తర్వాత రైతుల ప్రభుత్వం వస్తుంది అని చెప్పి కూడా ఈ సందర్భంగా గర్వంగా చెప్పగలుగుతాను. మళ్ళీ 'అప్సడా' పూర్వ వైభవంలోకి వస్తుంది. ఆ సంస్థకు సీఎం ఛైర్మన్‌గా ఉంటాడు. ఇప్పుడున్న సిండికేట్‌ను కూకటివేళ్లతో సహా పెకిలిస్తానని పేర్కొన్నారు.

# వైసీపీలో మళ్లీ కీలకం కానున్న చెవిరెడ్డి

**తిరుపతి :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లో కీలక నేతల పాత్రపై మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. పార్టీ వ్యవహారాలను ఎవరు సమన్వయం చేస్తున్నారు, అధినేతకు అత్యంత సన్నిహితంగా ఎవరు వ్యవహరిస్తున్నారు అనే అంశాలపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గతంలో పార్టీలో "కోటరీ" వ్యవస్థ ఉందంటూ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి పలు సందర్భాల్లో వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలు అప్పట్లో రాజకీయంగా పెద్ద చర్చకు దారితీశాయి. ప్రస్తుతం వైసీపీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా సజ్జల రామకృష్ణారెడ్డి వ్యవహరిస్తున్నారు. పార్టీ తరఫున విధానపరమైన ప్రకటనలు చేయడం, కీలక రాజకీయ అంశాలపై స్పందించడం, నాయకత్వ నిర్ణయాలను కేడర్‌కు చేరవేయడం వంటి బాధ్యతలను ఆయన నిర్వహిస్తూ వస్తున్నారు. అందుకే పార్టీ వ్యవహారాల్లో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో చాలాకాలంగా ఉంది.అయితే ఇటీవల మరో సీనియర్ నేత పేరు ఎక్కువగా వినిపిస్తోంది. తిరుపతి జిల్లా)కు చెందిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పార్టీ కేంద్ర కార్యాలయంలో చురుకుగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. పార్టీ కార్యక్రమాల సమన్వయంలో ఆయన పాత్ర పెరిగిందనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. చంద్రగిరి ) నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చెవిరెడ్డి, 2024 ఎన్నికల సమయంలో తన కుమారుడు మోహిత్ రెడ్డి ని రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. అదే ఎన్నికల్లో ఆయన ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేశారు. అయితే ఎన్నికల్లో కూటమి



ప్రభావంతో తండ్రీకొడుకులు ఇద్దరూ విజయం సాధించలేకపోయారు. తర్వాత లిక్కర్ కేసుకు సంబంధించి చెవిరెడ్డి అరెస్టై కొంతకాలం జైలులో ఉన్నారు. అనంతరం బెయిల్‌పై విడుదలైన తర్వాత ఆయన పార్టీ కార్యకలాపాల్లో మరింత చురుకుగా వ్యవహరిస్తున్నారని సమాచారం. ముఖ్యంగా తాడేపల్లి లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎక్కువ సమయం గడుపుతున్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. పార్టీకి సంబంధించిన వివిధ జిల్లాల పరిస్థితులపై సమాచారం సేకరించడం, స్థానిక నాయకులతో సమన్వయం చేయడం, ఆ వివరాలను పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి చేరవేయడం వంటి బాధ్యతల్లో చెవిరెడ్డి పాల్గొంటున్నారనే ప్రచారం కొనసాగుతోంది. అలాగే పార్టీ కార్యక్రమాలు సమర్థంగా అమలు అయ్యేలా పర్యవేక్షిస్తున్నారని కూడా పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇటీవల కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన నిరసన కార్యక్రమాల నిర్వహణలో కూడా చెవిరెడ్డి చురుకుగా వ్యవహరించారని ఆయన అనుచరులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాయకులతో నిరంతరం సంప్రదింపులు జరిపి కార్యక్రమాలను సమన్వయం చేశారని వారు పేర్కొంటున్నారు. ఈ కారణంగా ఆయనకు పార్టీ అధినాయకత్వం వద్ద మరింత ప్రాధాన్యం పెరిగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు సజ్జల రామకృష్ణారెడ్డి ఇప్పటికీ పార్టీ విధానపరమైన అంశాల్లో కీలక పాత్ర పోషిస్తూనే ఉన్నారని పరిశీలకులు గుర్తుచేస్తున్నారు. అధికారిక ప్రకటనలు, రాజకీయ స్పందనలు ఎక్కువగా ఆయన ద్వారానే వెలువడుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో సజ్జల, చెవిరెడ్డి ఇద్దరూ పార్టీ వ్యవహారాల్లో ముఖ్యమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారనే చర్చ కొనసాగుతోంది. అయితే పార్టీలో వారి పాత్రలు ఎలా మారతాయి, భవిష్యత్‌లో బాధ్యతల పంపిణీలో ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటాయనే అంశంపై అధికారికంగా ఎలాంటి ప్రకటన లేదు. దీంతో వైసీపీ అంతర్గత రాజకీయాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి కొనసాగుతోంది.

# కూటమి ఎమ్మెల్యేలే టార్గెట్‌గా రావణ్ టీమ్

**అనంతపురం :** ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం రేపుతున్న 'ప్రశ్న' యూట్యూబ్ ఛానల్ బ్లాక్‌మెయిలింగ్, వేధింపుల కేసు విచారణలో తాజాగా మరో సంచలన నిజాన్ని వెలుగులోకి వచ్చింది. అనంతపురం జిల్లా కల్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబును వ్యక్తిగతంగా, రాజకీయంగా దెబ్బతీయడానికి ఈ యూట్యూబ్ ముఠా పెద్ద ఎత్తున కుట్ర పన్నినట్లు అంతర్గత విచారణలో బయటపడింది. 'ప్రశ్న' నిర్వాహకుడు జోసెఫ్ అలియాస్ రావణ్, అతని అనుచరులు చాలా కాలంగా ఎమ్మెల్యేకు వేధింపులు గురిచేసినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది.ఎమ్మెల్యే సురేంద్ర బాబుపై సమాజంలో అప్రతిష్ట తెచ్చేలా తప్పుడు అవినీతి ఆరోపణలతో వీడియోలు రూపొందించడం వెనుక కీలక సూత్రధారుల లింకులు బయటపడ్డాయి. ఈ కుట్ర వెనుక వైసీపీ నేత ఉమామహేశ్వర్ నాయుడి సోదరుడు ఇంద్రసేన నాయుడు ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు లభించాయి. ఆయనతో పాటు 'ప్రశ్న' యూట్యూబ్ ఛానల్ సీఈవో గమన కూడా ఈ ప్లాన్‌లో భాగస్వామి అయి, తెరవెనుక స్క్రిప్ట్ డిజైనింగ్, ఫండింగ్ వ్యవహారాలను నడిపించినట్లు జిల్లావ్యాప్తంగా జోరుగా చర్చ సాగుతోంది.కూటమి ప్రభుత్వానికి చెందిన ప్రజాప్రతినిధులను టార్గెట్ చేస్తూ విపక్షాలు, కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న ఇటువంటి విష ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇదివరకే పార్టీ నేతలకు సూచించారు. తాజా పరిణామాల నేపథ్యంలో గమన, ఇంద్రసేన నాయుడుల వ్యవహారంపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ డిజిటల్ నెట్‌వర్క్ వెనుక ఉన్న మరికొంతమంది కీలక వ్యక్తుల కాల్ డేటా, ఆర్థిక లావాదేవీలను వెలికితీసేందుకు గన్నవరం పోలీసులు తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు.

**వెనక్కి తగ్గిన పోలీసులు**

యూట్యూబ్ ఛానల్ నిర్వాహకుడు బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ ప్రసన్న రావణ్ కేసు విచారణలో ఊహించని మలుపు చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా రావణ్‌ను 10 రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలంటూ




పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై గన్నవరం కోర్టులో విచారణ జరిగింది. అయితే, నాటకీయ పరిణామాల మధ్య ఆ కస్టడీ పిటిషన్‌ను తాము వెనక్కి (ఉపసంహరణ) తీసుకుంటున్నట్లు పోలీసుల తరపు న్యాయవాది న్యాయస్థానానికి అధికారికంగా తెలియజేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలతో పాటు మావోయిస్టు భావజాల వ్యాప్తి, సాయుధ తిరుగుబాటును ప్రోత్సహించేలా మాట్లాడారనే తీవ్రమైన ఆరోపణలపై గన్నవరం పోలీసులు రావణ్‌పై ఉపా (ఊంఖం) చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన సంగతి తెలిసిందే. ఈ కేసు మూలాలను, ఆర్థిక లావాదేవీలను వెలికితీసేందుకు 10 రోజుల పోలీసు కస్టడీ అవసరమని గత శుక్రవారం పోలీసులు కోరారు. అయితే, ఈ కేసులో 'ప్రశ్న' యూట్యూబ్ ఛానల్ సీఈఓ గమనతో పాటు పలువురు కీలక వ్యక్తులను గన్నవరం డీఎస్పీ కార్యాలయంలో పోలీసులు ఇప్పటికే సుదీర్ఘంగా విచారించి అవసరమైన వివరాలు, డిజిటల్ ఆధారాలను సేకరించినట్లు తెలుస్తోంది.రావణ్ కస్టడీ అవసరం లేదని భావించి పోలీసులు వెనక్కి తగ్గినట్లు న్యాయవర్గాల్లో చర్చ సాగుతోంది. పోలీసులు కస్టడీ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడంతో జోసెఫ్ రావణ్ ప్రస్తుతానికి నెల్లూరు సెంట్రల్ జైల్లోనే జ్యుడీషియల్ రిమాండ్‌లో కొనసాగనున్నారు. మరోవైపు, ఈ కేసులో ప్రభుత్వం కావాలనే ఉపా వంటి కఠిన చట్టాలను అక్రమంగా ప్రయోగిస్తోందని రావణ్ తరఫు న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి కోర్టు వెలుపల తీవ్ర ఆరోపణలు చేశారు. తనపై నమోదైన పలు కేసులను ఒకే కేసుగా విచారించాలని కోరుతూ రావణ్ ఇప్పటికే ఏపీ హైకోర్టును కూడా ఆశ్రయించారు. పోలీసుల తాజా ఉపసంహరణ నిర్ణయంతో ఈ పొలిటికల్ అండ్ లీగల్ డ్రామా ఏ మలుపు తిరుగుతుందో అన్నది ఆసక్తికరంగా మారింది

## అమరావతి 2.0 మాస్టర్ ప్లాన్...

-మొదటిపేజీ తరువాయి

'క్రియేటివ్ సిటీ' నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణంతో అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. ఎల్‌నినోతో ఇబ్బందులు ఎదురైనా, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా నదికి తరలించడంతో రాజధాని ప్రాంతం జలకళను సంతరించుకుందని గుర్తుచేశారు. గ్లోబల్ బెంచ్‌మార్కింగ్ చేరుకోవడం, రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం గణనీయంగా పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ బిల్డింగ్ విధానాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పి.నారాయణ, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పోలీసుల వైఫల్యం వల్లే ఈ ఘోరం

తెలంగాణ రాష్ట్రం షాబాద్‌లో చోటుచేసుకున్న ఘోర సామూహిక హత్యల ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బుధవారం ఒక లేఖ రాశారు. పోక్సో చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని, బాధితులకు పూర్తిస్థాయి భద్రత కల్పించేలా కఠిన చర్యలు చేపట్టాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. షాబాద్‌లో జరిగిన ఈ దారుణ ఉదంతాన్ని పవన్ కల్యాణ్ తన లేఖలో ప్రధానంగా ప్రస్తావించారు. పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్, 16 ఏళ్ల బాధితురాలితో పాటు ఆమె తల్లి, నానమ్మను పొట్టనబెట్టుకున్నాడు. ఆ తర్వాత తనతో గొడవపడుతుందని భార్య, ఇద్దరు పిల్లలను చంపేసి, ఆపై తాను కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ దారుణం వ్యవస్థీకృత వైఫల్యానికి నిదర్శనమని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. పోక్సో కేసుల్లో దర్యాప్తులో నిర్దిష్ట కాలపరిమితిని పాటించాలని, సాక్ష్యాధారాలు తారుమారుకు తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సదరు కేసులో నిందితుడికి ముందస్తు బెయిల్ లభించడం, అదే సమయంలో బాధితుల కుటుంబానికి తగిన రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమవడంపై పవన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. పోక్సో కేసులకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని సుప్రీంకోర్టు గతంలో పలుమార్లు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

## 3 సంవత్సరాలు 36 ప్రాజెక్టులు

-మొదటిపేజీ తరువాయి

కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలనలో సాగునీటి రంగంపై నిర్లక్ష్యం చూపారంటూ గణాంకాలతో సహా ఎండగట్టారు. ఒక వ్యక్తి ప్రాధాన్యతల కోసం రాష్ట్ర ప్రజల భవిష్యత్తును, రైతాంగ ప్రయోజనాలను ఫణంగా పెట్టారని తీవ్రంగా ఆరోపించారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఏకరువు పెట్టిన చంద్రబాబు, వారి పాలనలో జరిగిన మోసపూరిత చర్యలను తీవ్రంగా ఖండించారు. "వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తికాకుండానే, సొరంగంలో యంత్రం ఇరుక్కుపోయిన విషయాన్ని దాచిపెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నట్లు బోర్డు పెట్టి నాటకాలడారు. ప్రజలను ఇంత దారుణంగా మోసం చేస్తారా? వారి మోసానికి ప్రతీక అయిన ఆ ప్రారంభోత్సవ బోర్డును మ్యూజియంలో పెట్టి, ప్రజలకు శాశ్వతంగా గుర్తుండేలా చేస్తాను" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. 2019-24 మధ్య కాలంలో ప్రాజెక్టుల గేట్లకు కనీసం గ్రీజు కూడా పూయని దుస్థితి ఉండేదని, పులిచింతల, గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని విమర్శించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాని దారుణమైన పరిస్థితిని సృష్టించారని మండిపడ్డారు. తాము ఎంతో కష్టపడి పూర్తి చేసిన పట్టిసీమ ప్రాజెక్టును 'వట్టిసీమ', 'దండగ' అని ఆనాడు ప్రతిపక్షంలో ఉండి విమర్శించిన వారే, అధికారంలోకి వచ్చాక దాని విలువను గుర్తించలేకపోయారని అన్నారు. "నేను ఆ రోజు వారి విమర్శలకు భయపడి ఉంటే, ఈ పదేళ్లలో కృష్ణా డెల్టా పరిస్థితి ఏమై ఉండేదో ఒక్కసారి ఆలోచించండి. పట్టిసీమ ద్వారా గడిచిన పదేళ్లలో 450 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణాకు తరలించి 13 లక్షల ఎకరాలను స్థిరీకరించాం" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**36 ప్రాజెక్టులు, 3 సంవత్సరాలు**

విమర్శలకే పరిమితం కాకుండా, రాష్ట్రాన్ని జల సమృద్ధంగా మార్చేందుకు తమ ప్రభుత్వ బృహత్ ప్రణాళికను చంద్రబాబు ఆవిష్కరించారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 36 కీలక సాగునీటి ప్రాజెక్టులను రూ.35 వేల కోట్ల వ్యయంతో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టుల పూర్తికి స్పష్టమైన గడువులను నిర్దేశించారు. "రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఇప్పటికే 37 సార్లు భౌతికంగా, 37 సార్లు వర్చువల్‌గా సమీక్షలు నిర్వహించాను. పునరావాసంపై ప్రత్యేక దృష్టి సారించి నిర్వాసితులకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. తాను 1996లో శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ఈ ఏడాది సెప్టెంబర్ 1న ప్రారంభిస్తామని తెలిపారు. వీటితో పాటు వంశధార-నాగావళి-గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం తన చిరకాల స్వప్నమని, దానిని సాకారం చేసే దిశగా అడుగులు వేస్తామని పునరుద్ఘాటించారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, చింతలపూడి ఎత్తిపోతల, వరికపూడిశెల వంటి అనేక ప్రాజెక్టుల పూర్తికి నిర్దిష్ట తేదీలను ప్రకటించి, ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని చాటుకున్నారు.

**మహనీయుల స్ఫూర్తితో ముందుకు**

ఈ సందర్భంగా డాక్టర్ కేఎల్ రావు, సర్ ఆర్థర్ కాటన్, శివరామకృష్ణయ్య, నందమూరి తారక రామారావు వంటి మహనీయులు సాగునీటి రంగానికి చేసిన సేవలను చంద్రబాబు స్మరించుకున్నారు. వారి దూరదృష్టి వల్లే ఈరోజు రాష్ట్రం అన్నపూర్ణగా నిలిచిందన్నారు. మంచి పనులు చేసిన వారిని ప్రజలు ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారని, చెడును ఖండించాల్సిన బాధ్యత కూడా ప్రజలపై ఉందని హితవు పలికారు. తాము అధికారంలోకి వచ్చాక ధవళేశ్వరం, తుంగభద్ర బ్యారేజీల గేట్లను యుద్ధప్రాతిపదికన మార్పించామని, నిర్వహణ లోపాలను సరిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేఎల్ రావు కుమారుడు విజయరావు కోరిన వైకుంఠపురం బ్యారేజీ నిర్మాణాన్ని కూడా తప్పకుండా చేపడతామని హామీ ఇచ్చారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని, జల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.

## ముగిసిన ముద్రగడ అంతమయాత్ర

కిర్లంపూడి, జూలై 15): మాజీ మంత్రి, వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం పార్థివదేహానికి వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ముద్రగడ పద్మనాభం గారి నివాసానికి చేరుకున్న ఆయన, పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి అశ్రునివాళి అర్పించారు. అనంతరం ముద్రగడ పద్మనాభం సతీమణి, కుమారుడు ముద్రగడ గిరిబాబు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించిన వైయస్ జగన్, ఈ తీరని విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కల్పించాలని ఆకాంక్షిస్తూ వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముద్రగడ పద్మనాభంతో తనకున్న అనుబంధాన్ని స్మరించుకున్న వైయస్ జగన్, ఆయన ప్రజాసేవ, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. సమాజం కోసం జీవితాన్ని అంకితం చేసిన నాయకుడిగా ముద్రగడ పద్మనాభం చిరస్థాయిగా గుర్తుండిపోతారని పేర్కొన్నారు. ముద్రగడ పద్మనాభం అంతిమ సంస్కార కార్యక్రమం పూర్తయ్యే వరకు వైయస్ జగన్ అక్కడే ఉండి నివాళులు అర్పించారు. అనంతిమయాత్రలో స్వయంగా పాల్గొని ముద్రగడ పద్మనాభం పాడెను మోసి, ఆయన పట్ల తనకున్న గౌరవం, ఆత్మీయ అనుబంధాన్ని చాటుకున్నారు.

## జొన్నగిరి గోల్డ్ మైన్స్ విస్తరణ..

**కర్నూలు :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పారిశ్రామిక మరియు గనుల రంగాన్ని బలోపేతం చేసే దిశగా ఒక కీలక నిర్ణయం తీసుకుందికర్నూలు జిల్లాలోని ప్రసిద్ధ 'జొన్నగిరి గోల్డ్ మైన్స్'బంగారు గనులు) ప్రాజెక్టు విస్తరణకు ప్రభుత్వం భారీగా భూములను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టు కోసం అదనంగా మరో 998 ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం అధికారికంగా అనుమతులు మంజూరు చేసింది. ఈ భూసేకరణలో భాగంగా ఏపీ దేవాదాయ శాఖకు చెందిన భూములను కూడా వినియోగించుకోనున్నారు.దేవాదాయ శాఖ పరిధిలోని సుమారు 40 ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన ఈ గోల్డ్ మైన్స్ ప్రాజెక్ట్ కోసం ఉపయోగించుకునేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన లీజు నిబంధనలు మరియు ప్రక్రియను పూర్తి చేస్తూ ఏపీ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులను విడుదల చేసింది.

PEN SATTA
Telugu Daily
పెన్ సత్తా
గురువారం 16 జూలై 2026

# మహిళల భద్రతకు అండగా 'అభయ' హస్తం







- అనకాపల్లి జిల్లాలో పోలీసులు చేపట్టిన అభయ కార్యక్రమం
- అట్టహాసంగా ప్రారంభించిన హోం మంత్రి అనిత
- సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి అనిత

**నక్కపల్లి, పెన్ సత్తా జులై 15 :**మహిళల భద్రతకు అండగా అభయ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని రాష్ట్ర హోం శాఖామంత్రి వంగలపూడి అనిత అన్నారు. మహిళల భద్రతను మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో అనకాపల్లి జిల్లా పోలీసులు "మీ భద్రత -- మా బాధ్యత" అనే నినాదంతో చేపట్టిన 'అభయ' కార్యక్రమాన్ని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత వేంపాడు టోల్ ప్లాజా సమీపంలోని భారతి కన్వెన్షన్‌లో బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా పాల్గొన్నారు. దీనిలో భాగంగా హోంమంత్రి అనిత అభయ ఫిర్యాదుల బాక్స్‌ను ప్రారంభించడంతో పాటు, అభయ పోస్టర్లను ఆవిష్కరించారు. మహిళలు, విద్యార్థినులు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేసేందుకు జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో అభయ ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేయనున్నట్లు పోలీసులు ఆమెకు వెల్లడించారు. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, మహిళల భద్రత కోసం అనకాపల్లి పోలీసులు చేపట్టిన 'అభయ' కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు. మహిళలకు ధైర్యాన్ని నింపడంతో పాటు, వారిలో భద్రతా భావాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

తల్లిదండ్రులు, విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణ కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం శక్తి యాప్, శక్తి టీమ్స్ ద్వారా మహిళలకు రక్షణ కల్పిస్తోందని పేర్కొన్న హోంమంత్రి, ఎవరైనా వేధింపులకు గురైతే వెంటనే 112కు కాల్ చేయాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు నిరంతరం నిఘా ఉంచాలని, ప్రతి విద్యార్థి ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. అనకాపల్లి జిల్లాలో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ డ్రోన్ల ద్వారా కూడా పర్యవేక్షణను విస్తృతంగా చేపడుతున్నామని హోంమంత్రి తెలిపారు. మహిళల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వీటిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.






# బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి రూ.50 వేల జరిమానా




అక్రమ పీడీఎస్ బియ్యం వ్యాపారులపై కఠిన చర్యలు కొనసాగుతాయి.. వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప

**ధర్మవరం,జూలై 15 =(పెన్ సత్తా)** జిల్లా ఎస్పీ సతీష్ కుమార్,ఐపీఎస్ ఆదేశాల మేరకు,బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి రూ.50,000 జరిమానా విధించినట్లు ధర్మవరం వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.సీఐ వెల్లడించిన వివరాల ప్రకారం,బత్తలపల్లి మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన, ప్రస్తుతం ధర్మవరంలోని వైఎస్సార్ కాలనీలో నివాసముంటున్న ధనుంజయ్ (33), తండ్రి నాగరాజు, రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీపై పంపిణీ చేసే పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, అక్రమ లాభార్జన కోసం కర్ణాటకతో పాటు ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నట్లు గుర్తించారు.

ఈ వ్యవహారంలో గతంలో అతనిపై క్రైమ్ నెం.32/2026లో ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్-1955లోని సెక్షన్ 7(1) కింద కేసు నమోదు కాగా, అనంతరం క్రైమ్ నెం.119/2026లో కూడా అదే చట్టం కింద మరో కేసు నమోదు చేశారు.

మొదటి కేసు అనంతరం ఎంసీ నెం.45/2026 ప్రకారం ఎంఆర్వో సమక్షంలో రూ.5 లక్షల బాండ్‌పై బైండోవర్ చేసినప్పటికీ,మళ్లీ అదే తరహా నేరానికి పాల్పడడంతో బాండ్ నిబంధనలను ఉల్లంఘించినట్లు అధికారులు నిర్ధారించారు.

దీంతో బుధవారం ఎంఆర్వో సమక్షంలో హాజరుపరచగా, బాండ్‌లోని ఫోర్‌ఫీచర్ నిబంధనల మేరకు రూ.50,000 జరిమానా విధించారు. జరిమానా మొత్తాన్ని నిందితుడు ట్రెజరీలో చలాన్ ద్వారా జమ చేసినట్లు సీఐ తెలిపారు.ఈ సందర్భంగా సీఐ రెడ్డప్ప మాట్లాడుతూ,

బైండోవర్ చేసిన వ్యక్తులు తిరిగి నేరాలకు పాల్పడితే బాండ్ నిబంధనల ప్రకారం జరిమానాలతో పాటు మరిన్ని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు,నిల్వ, రవాణా లేదా విక్రయం చేసే వారిపై నిరంతరం కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# ఉచిత మెగా వైద్య శిబిరమును పేద ప్రజలు సద్వినియోగం చేసుకోండి



అధ్యక్షులు షీలా నాగేంద్ర,కార్యదర్శి జయరాం

**ధర్మవరం,జూలై 15 (పెన్ సత్తా)** పట్టణములోని కొత్తపేటలో గల ఉషోదయ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో జూలై 26వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత మెగా వైద్య శిబిరమును నిర్వహిస్తున్నట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర,కార్యదర్శి జయరాం,కోశాధికారి వెంకట నాగార్జున, క్యాంపు చైర్మన్ అండ్ పోలా ప్రభాకర్ తెలిపారు.ఈ సందర్భంగా వారు పట్టణంలోని స్వాతి క్లినిక్ లో శిబిరముల కరపత్రాలను విడుదల చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ, ఈ శిబిరం కీర్తిశేషులు జె,సూర్య కుమారి, కీర్తిశేషులు డాక్టర్ జె .వెంకట్రామప్ప జ్ఞాపకార్థం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.అంతే కాకుండా ఈ శిబిరం యువర్స్ ఫౌండేషన్, కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ వారిచే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ మాధవి,డాక్టర్ అపర్ణ,డాక్టర్ వీరభద్రయ్య,డాక్టర్ కొండయ్య,డాక్టర్ మనోజ్ కుమార్,డాక్టర్ భాను కిరణ్,డాక్టర్ అభిషేక్,డాక్టర్ బి వి సుబ్బారావు తో పాటు ఆప్తాలిక్ అసిస్టెంట్ షేక్ సికిందర్ కూడా వైద్య సేవలను అందిస్తారని తెలిపారు.ఉచిత వైద్య చికిత్సలతో పాటు ఉచిత ఆపరేషన్లు ఉచిత వసతి ఉచితంగా అద్దాలను కూడా పంపిణీ చేస్తామని తెలిపారు.కావున ఈ అవకాశాన్ని ప్రతి పేదవాడు ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9440248192 గాని 9959331224 కు గాని సంప్రదించాలని తెలిపారు.

# పీసీపీఐఆర్ రోడ్ లో రైతులకు అనుకూలమైన క్రాసింగ్ ఏర్పాటు చేయాలి

- ఆర్ అండ్ బి జే ఈ ని కోరిన కాగిత రైతులు





**నక్కపల్లి, పెన్ సత్తా, జులై 15:** ఏపీఐఐసీ ద్వారా నూతనంగా ఏర్పాటు చేస్తున్న పి సి పి ఐ ఆర్ రోడ్లో రైతులు రోడ్డు దాటేందుకు అనుకూలమైన క్రాసింగ్( యూటర్న్ ) ఏర్పాటు చేయాలని బుధవారం కాగిత గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆర్ అండ్ బి జే ఈ లలితను కోరారు. కాగిత గ్రామం నుండి పి సి పి ఐ ఆర్ రోడ్డుకు ఎగువన ఉన్న సుమారు 400 ఎకరాలలో పంటలు పండించేందుకు,పశువుల మేతకు నిత్యం వందలాదిమంది రోడ్డు దాటి వెళ్లాల్సి ఉంది. ఉపాధి హామీ పథకం ద్వారా ఆయా పంట భూముల్లోకి వెళ్లేందుకు ఇప్పటి కే గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న స్టీల్ ప్లాంట్ రోడ్డులో రైతులు రోడ్డు దాటేందుకు వీలు లేకుండా ఆర్ అండ్ బి అధికారులు ఈ రహదారికి ఎదురుగా డివైడర్ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో రైతులు, పశువులు రోడ్డు దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయంపై గతంలో డివైడర్ నిర్మాణం పనులు అడ్డుకోవడంతోపాటు తహసిల్దార్, ఆర్డిఓ లకు రైతులకు అనుకూలమైన క్రాసింగ్ ఏర్పాటు చేయాలని కాగిత రైతులు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. రోడ్డును పరిశీలించేందుకు వచ్చిన జే ఈ లలితను బుధవారం గ్రామానికి చెందిన రైతులు ఆ ప్రాంతంలో అడ్డుకొని పరిస్థితులను ఆమెకు వివరించారు. దీనిపై స్పందించిన ఆమె రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అనుకూలమైన యూటర్న్ ఏర్పాటు చేస్తామని ఈ సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తానని ఆమె తెలిపారు. అలాగే రైతులంతా కలిసి ఇదే సమస్యపై ఉన్నతాధికారులకు అర్జీ పెట్టుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పోతంశెట్టి బాబ్జి, గుమ్మెళ్ళ జమీలు, గణేష్,దేవవరపు శివ, అడపా రమణ రాజారావు, పోతంశెట్టి రామకృష్ణ, గోవిందు, గుండుబిల్లి గంగేష్ ఆర్ అండ్ బి అధికారులు తదితరులు ఉన్నారు.

# నక్కపల్లి లో ముద్రగడకు ఘన నివాళి

- శ్రద్ధాంజలి ఘటించిన వైసీపీ శ్రేణులు



**నక్కపల్లి, పెన్ సత్తా, జులై 15:**ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్న కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ ముద్రగడ పద్మనాభం కు వైసీపీ శ్రేణులు ఘన నివాళులర్పించారు. వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక వైసీపీ కార్యాలయం వద్ద కీర్తిశేషులు ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ముద్రగడ స్వర్గస్తులయ్యారనే వార్త తీవ్ర దిగ్భ్రాంతికి, శోకసముద్రంలోకి నెట్టివేసిందన్నారు.ఎంతోమందికి ఆదర్శప్రాయంగా నిలిచిన ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ,పొడకట్ల పాపారావు, గంట తిరుపతిరావు, సాదిరెడ్డి శ్రీను, తల్లా భార్గవ్, వీసం రాజు, అల్లాడ కొండబాబు, పోతంశెట్టి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యత

- ప్రజల నుండి ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తప్పవు
- మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య



**ధర్మవరఓ, జూలై 15 (పెన్ సత్తా)** పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యత అని, ప్రజల నుండి ఫిర్యాదులు అందితే సంబంధిత ఉద్యోగులపై,వర్కర్లపై కఠిన చర్యలు తప్పవు అని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య తెలిపారు.ఈ సందర్భంగా వారు పట్టణంలోని వార్డు శానిటేషన్, పర్యావరణ కార్యదర్శులతో సీజనల్ వ్యాధుల నివారణపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన రహదారులు,లోతట్టు ప్రాంతాలలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని,చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం, కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టడం లాంటివి పై ప్రత్యేక శ్రద్ధను కనపరచాలని తెలిపారు.ఎక్కడ ఎటువంటి అపరిశుభ్రత ఉండరాదని,అలా ఉన్నట్లు సమాచారం అందితే మేస్త్రీలు శానిటరీ ఇన్స్పెక్టర్లు వేలు వెంటనే చర్యలు తీసుకోక తప్పదు అని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ శ్యాం సన్,మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్దాం

తెదేపా నాయకులు



**ధర్మవరం,జూలై 15 (పెన్ సత్తా)**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా వారు గ్రామ/వార్డు స్థాయిలలో ప్రజా సమస్యలను గుర్తించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్దామని తెదేపా నాయకులు అన్నారు.రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ సూచనలను అనుసరించి ధర్మవరం పట్టణం గాంధీనగర్ సర్కిల్లో గల తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ధర్మవరం పట్టణ రూరల్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తెదేపా నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జ్ చింతలపల్లి మహేష్,ధర్మవరం పట్టణ అధ్యక్షుడు పరిసే సుధాకర్ మాట్లాడుతూ, తెలుగుదేశంపార్టీ నాయకులు తమ గ్రామ/వార్డు లలో పర్యటించి ప్రజల మౌలిక సదుపాయాలను వారి వ్యక్తిగత సమస్యలను గుర్తించి నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకువెళ్దామని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు ముందుకు వెళ్లాలని, సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలకు నాయకులు సూచించారు. అదేవిధంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ ప్రజాక్షేత్రంలోనే ఉండాలని ప్రజలతో మమేకమవ్వాలని వారు తెదేపా నాయకులకు తెలియజేశారు. అదేవిధంగా రాష్ట్ర పార్టీ ఇచ్చిన ప్రతి ఒక్క కార్యక్రమాన్ని ధర్మవరం నియోజకవర్గంలో పూర్తిస్తాయిలో దిగ్విజయంగా ముందుకు తీసుకెళుతున్నందుకు నియోజకవర్గ తెదేపా కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. రానున్న డోర్ టు డోర్ కార్యక్రమాన్ని కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు తీసుకువెళ్లి రాష్ట్రంలోనే ధర్మవరం నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో నిలిపే విధంగా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలో గల పలు సమస్యలతో కూడిన తీర్మానాన్ని రాష్ట్ర పార్టీ కార్యాలయానికి పంపడం జరిగింది అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ/మండల కమిటీ సభ్యులు క్లస్టర్ ఇంచార్జ్ లు యూనిట్ ఇంచార్జ్ లు ,తెదేపా కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో క్యాబినెట్ ఏర్పాటు,ప్రమాణ స్వీకార వేడుకలు




**ధర్మవరం,జూలై 15 (పెన్ సత్తా)** పట్టణంలోని యశోద కాన్సెప్ట్ పాఠశాలలో క్యాబినెట్ ఏర్పాటుతో పాటు ప్రమాణ స్వీకార వేడుకలు విద్యార్థుల నడుమ ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందని కరెస్పాండెంట్ మల్లికార్జున తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాఠశాల యందు విద్యార్థులను గ్రూపులుగా విభజించి,నూతన ఎస్ పి ఎల్,ఏ ఎస్ పి ఎల్ గా నియమించడం జరిగిందన్నారు. తదుపరి సాహిత్య, సాంస్కృతిక కీడలు, క్రమశిక్షణ యందు కెప్టెన్,వైస్ కెప్టెన్లను నియమిస్తూ వారి చేత ప్రమాణ స్వీకారం కూడా చేయించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులను మంచి క్రమశిక్షణ అలవర్చుకొని ఇక్కడ ఉన్న అవకాశాలను అందిపుచ్చుకొని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే మా లక్ష్యము అని తెలిపారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పృథ్వీరాజ్, ప్రిన్సిపాల్ అనూప్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## చక్కటి కంటిచూపు-చక్కటి విద్యకు మార్గం

జిల్లా అంధత్వ నివారణ అధికారిని డాక్టర్ అనురాధ



**ధర్మవరం,జూలై 15 (పెన్ సత్తా)** చక్కటి కంటిచూపు–చక్కటి విద్యకు మార్గం అవుతుందని జిల్లా అందత్వ నివారణ అధికారిని డాక్టర్ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ధర్మవరం మండలం దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోవిద్యార్థినీ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది.అనంతరం వారు మాట్లాడుతూ, మొత్తం 142 మంది విద్యార్థినీ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా అందులో ముగ్గురికి మాత్రమే కంటి అద్దాలకు సిఫారసు చేయడం జరిగింది అని తెలిపారు.. విద్యార్థులకు కంటిచూపు యొక్క ఆవశ్యకతను తెలియజేయడం జరిగిందన్నారు.కంటి చూపు మెరుగు పడటానికి ఎటువంటి ఆహార పదార్థాలు తీసుకోవాలి? అలాగే విటమిన్ ఏ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు గురించి విద్యార్థులకు తెలియజేశామన్నారు.మొబైల్ ఫోన్లు ఎక్కువగా వాడకూడదని విద్యార్థులకు తెలియజేశామన్నారు.ఈ కార్యక్రమంలో ఆప్థాలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప,హెల్త్ సూపర్వైజర్ రాజశేఖర్ రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిమ్మారెడ్డి, ఉపాధ్యాయ బృందం , వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లేపాక్షి లో జూలై 27 నుండి 29 వరకు జరిగే రాజకీయ శిక్షణ తరగతులు జయప్రదం చేయండి




సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు

**ధర్మవరం,జూలై 15 (పెన్ సత్తా)** శ్రీ సత్య సాయి జిల్లాలోని లేపాక్షి మండలంలోని ఆర్ జె హెచ్ ఫంక్షన్ హాల్ లో జూలై నెల 27,28,29 తేదీలలో మూడు రోజుల పాటు జరిగే జిల్లా సైద్ధాశీతికతిక రాజకీయ శిక్షణ తరగతులు జయప్రదం చేద్దామని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భూమికోసం భుక్తి కోసం ఎందరో వీరుల ప్రాణత్యాగం వలన భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాల పూర్తి చేసుకున్నదని వారి తెలిపారు.2014 ఎన్నికలలో ఎన్డీఏ ప్రభుత్వం ధరల నియంత్రణ,నల్లధనం వెలికితీత,జనధన్ ఖాతాలు ఉన్నవారి ఖాతాలలో రూ.15 లక్షల డబ్బు జమ చేస్తామని దేశ ప్రజలను ప్రధాని మోదీ మోసం చేయడం దారుణమన్నారు. శ్రమజీవుల స్వేదంతో నిర్మితమైన ప్రభుత్వ రంగ సంస్థలను ఆదానీ,అంబానీలకు కారు చౌకగా కట్టపెట్టడమే ధ్యేయంగా ప్రధాని మోడీ పాలన సాగిస్తున్నారని తెలిపారు.కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కారు చౌకగా కట్టపెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మహాత్మా గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకానికి విబి జి రాంజీ పేరు చేర్చడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ సూపర్ సిక్స్ పథకాలలో చెప్పిన విధంగా పట్టణాలలో 2 సెంట్లు,గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం రూ.4 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.మహిళా శక్తి పేర మహిళలకు నెలకు రూ.1500 జమ చేస్తామన్న హామీ ఏమైందని,నిరుద్యోగ భృతి,విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్,స్కాలర్ షిప్ ఆటకెక్కించడం సరి కాదని హితవు పలికారు.టిడ్కో ఇండ్లను వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు అంద జేయాలని కోరారు.కరువు, వలసలు,ఆత్మహత్యల నిర్మూలన కోసం శాశ్వత పరిష్కారాలు నిర్వహించాలని వారి డిమాండ్ చేశారు. ఇటీవలే బత్తలపల్లి లో శిక్షణా తరగతులకు సంబంధించిన అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. కావున నియోజకవర్గంలోని ధర్మవరం,బత్తలపల్లి,తాడిమర్రి,ముదిగుబ్బ మండలాలలోని సిపిఐ నాయకులు కార్యకర్తలు,పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని తెలిపారు.

## చిన్నారి లక్ష్మణ్‌కు అండగా మంత్రి సత్యకుమార్ యాదవ్ అత్యుత్తమ వైద్య సేవలకు తక్షణ చర్యలు

చిన్నారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ.. రాయుడు ఈఎన్‌టీ వైద్యులతో స్వయంగా మాట్లాడిన మంత్రి



**ధర్మవరం, జూలై 15, (పెన్ సత్తా)**:ధర్మవరం పట్టణంలోని పీఆర్టీ స్ట్రీట్‌కు చెందిన గుడిపాటి శ్రీరామ్ గారి ఐదున్నరేళ్ల కుమారుడు లక్ష్మణ్ వినికిడి సమస్యతో బాధపడుతున్న విషయం రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ గారి దృష్టికి తీసుకురాగా మంత్రి అత్యంత మానవీయ దృక్పథంతో వెంటనే స్పందించి చిన్నారికి అత్యుత్తమ వైద్య సేవలు అందేలా తక్షణ చర్యలు చేపట్టారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న వెంటనే ఎలాంటి ఆలస్యం లేకుండా అవసరమైన వైద్య సహాయం అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్, తన కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు, బుధవారం సాయంత్రం బాధిత కుటుంబాన్ని స్వయంగా వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. అనంతరం చిన్నారి లక్ష్మణ్‌ను మెరుగైన వైద్య చికిత్స కోసం విజయవాడకు తరలించే ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. రైలు ప్రయాణానికి అవసరమైన ఏర్పాట్లతో పాటు వైద్య చికిత్సకు సంబంధించిన అన్ని సమన్వయ చర్యలను పూర్తి చేసి, కుటుంబ సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసి విజయవాడకు పంపించారు. ఇదే సమయంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ విజయవాడలోని ప్రముఖ రాయుడు ఈఎన్‌టీ ఆసుపత్రి వైద్యులు డా. రాయుడుతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి, చిన్నారి లక్ష్మణ్ ఆరోగ్య పరిస్థితిని వివరించారు. చిన్నారికి అవసరమైన అన్ని వైద్య పరీక్షలు అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించి, అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని కోరారు. చికిత్స ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం లేదా ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్య బృందానికి సూచించారు. ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యత అనే సంకల్పంతో ప్రతి సమస్యపై వెంటనే స్పందిస్తూ, అవసరమైన సమయంలో ప్రజలకు అండగా నిలుస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్ సేవలను బాధిత కుటుంబ సభ్యులు హృదయపూర్వకంగా అభినందించారు. తమ బిడ్డకు మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు వెంటనే స్పందించి అన్ని ఏర్పాట్లు చేసిన మంత్రి సత్యకుమార్ యాదవ్ , అలాగే ప్రతి దశలో అండగా నిలిచి విజయవాడకు పంపించే వరకు అన్ని ఏర్పాట్లు చేసిన హరీష్ బాబు కు కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రశాంతంగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం.

- ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి.
- అభివృద్ధి పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.
- ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాస్.




**పరవాడ (పెన్ సత్తా)**మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్షురాలు పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా ముగిసింది. గత సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలపై ఆయా శాఖల అధికారులు చేపట్టిన చర్యలను వివరిస్తూ నివేదికలను చదివి వినిపించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయం, విద్య, వైద్య,ఆరోగ్యం, గ్రామీణ నీటి సరఫరా, గృహ నిర్మాణం తదితర శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలపై ఎంపీపీ సమీక్ష నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు తమ గ్రామాలు, పంచాయతీల పరిధిలో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించిన ఎంపీపీ, శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గత సమావేశాల్లో ఆమోదం తెలిపిన అభివృద్ధి పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు ఉపయోగపడే విధంగా వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయడంతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని సమస్యలను ఎంపీడీఓ లేదా ఎంపీపీ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని తక్షణ చర్యలు చేపడతామని తెలిపారు. మండల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యులు పైల సన్యాసిరాజు, ఎంపీడీఓ రమేష్ నాయుడు, తహసీల్దార్ పి.వి రత్నం, డిప్యూటీ తహసీల్దార్ అరుణ్ కుమార్, మండల వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సయ్యద్ అక్బర్ హుసేనీ గంధం పూజ



**హిందూపురం, (పెన్ సత్తా)**మండలంలోని మలుగూరు గ్రామ సమీపంలో వెలసిన హజ్రత్ సయ్యద్ అక్బర్ హుసేనీ స్వామి వారి గంధం పూజ మహోత్సవం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి సయ్యద్ షామీర్ జీలానీ బాషా గంధంను తలపై పెట్టుకొని తీసుకు వచ్చి అక్బర్ హుసేనీ సమాధికి సమర్పించారు.ప్రత్యేక గలప్ పూల చాదర్ సమాధిపై ఉంచి ప్రార్థనలు నిర్వహించారు. దొడ్డబళాపురం నుంచి పీర్ సాబ్ కుమారుడు తాజుద్దీన్ బాబా కూడా వచ్చి పూజల్లో పాల్గొన్నారు. కర్ణాటక ఆంధ్ర ప్రదేశ్ లోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. దువా ఫాతేహా అనంతరం విచ్చేసిన భక్తులు గ్రామస్థులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మలుగూరు గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు పెనుకొండ నుంచి మత పెద్దలు కూడా తరలి వచ్చారు. ప్రతి ఏటా ఈ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తామని పీఠాధిపతులు శామీర్ జీలానీ బాష్ సోదరులు తెలిపారు.

## ముద్రగడ పద్మనాభం మృతికి పార్టీ కార్యాలయంలో సంతాపం తెలిపిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



**అనంతపురం సిటీ,(పెన్ సత్తా):**కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మాజీ మంత్రివర్యులు ముద్రగడ పద్మనాభం మృతికి సంతాపంగా అనంతపురము లోని హెచ్ ఎల్ సీ కాలనీ లో ఉన్న వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నందు పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, శింగణమల నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ లు పార్టీ శ్రేణులతో కలసి పద్మనాభం చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముద్రగడ పద్మనాభం ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షింస్తూ కాసేపు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం నిబద్ధత, ఉద్యమ స్ఫూర్తి ఎప్పటికీ స్ఫూర్తి దాయకమన్నారు. ముద్రగడ ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా పని చేసి ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసారన్నారు. ఆయన చూపిన నిబద్ధత, ఉద్యమ స్ఫూర్తి ఎప్పటికీ స్ఫూర్తి దాయకమన్నారు. వెనుకబడిన వర్గాల కోసం, కాపుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసాడని గుర్తు చేశారు. ప్రభుత్వాలు అతన్ని అణచివేయాలని చూసిన వెనుకడుగు వేయకుండా ధైర్యంగా నిలబడిన వ్యక్తి ముద్రగడ పద్మనాభం అని కొనియాడారు. ముద్రగడ మరణం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి,మరీ ముఖ్యంగా కాపు సామాజిక వర్గానికి తీరనిలోటు అని, ఆయన ఆశయాలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తుందని పేర్కొన్నారు. జెడ్పీ ఛైర్పర్సన్ గిరిజమ్మ మాజీ మేయర్ వసీం పలువురు నేతలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## హాస్టళ్లను తనిఖీ చేసిన రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు ఈ.లక్ష్మీరెడ్డి



**పెనుకొండ,(పెన్ సత్తా):**పెనుకొండ, చెన్నేకొత్తపల్లి మండలాల్లోని ప్రభుత్వ వసతి గృహాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు ఇ. లక్ష్మీ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు.పెనుకొండలోని బీసీ సంక్షేమ బాలుర వసతి గృహం, గిరిజన సంక్షేమ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహంతో పాటు, సి.కె.పల్లిలోని గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహం, బీసీ సంక్షేమ బాలికల వసతి గృహాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న పౌష్టికాహారం, మెనూ అమలు, నాణ్యతా ప్రమాణాలు మరియు హాస్టళ్లలోని మౌలిక వసతులను ఆయన నిశితంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఈ సందర్భంగా అధికారులను, సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఎస్ఓ వంశీకృష్ణ రెడ్డి,ఐసిడిఎస్ పిడి ప్రమీల,పెనుకొండ తహసీల్దార్ స్వాతి,పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు, రెవెన్యూ మరియు ఆహార సరఫరా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలపై మంత్రి నారా లోకేష్ సమాధానం చెప్పాలి

కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఇర్ఫాన్ బాషా డిమాండ్



**ప్రొద్దుటూరు, (పెన్ సత్తా)**ప్రొద్దుటూరుకు రానున్న రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పార్టీ కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి మాట్లాడే ముందు రాష్ట్ర నిరుద్యోగ యువతకు కూడా సమాధానం చెప్పాలని ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ శ్రీ ఇర్ఫాన్ బాషా డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో కూటమి నాయకులు నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, ఉద్యోగం లేని యువతకు ప్రతినెల ?3,000 నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. అయితే ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తవుతున్నా ఆ హామీ అమలుపై ఎటువంటి స్పష్టత లేదని విమర్శించారు. ప్రొద్దుటూరులో అలాగే రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో యువతను ఆకర్షించడానికి ఇచ్చిన హామీలను ఇప్పుడు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.మంత్రి నారా లోకేష్ ప్రొద్దుటూరు పర్యటన సందర్భంగా ఈ అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలని, నిరుద్యోగ భృతి ఎప్పుడు అమలు చేస్తారో ప్రొద్దుటూరు మరియు రాష్ట్ర యువతకు తెలియజేయాలని ఇర్ఫాన్ బాషా డిమాండ్ చేశారు.ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం ప్రభుత్వ బాధ్యత. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది" అని ఆయన అన్నారు.కూటమి ప్రభుత్వం ఎన్నికల అన్ని హామీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ పోరాడుతూనే ఉంటుందని హెచ్చరించారు.

## దొరసానిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి లోకేష్



**ప్రొద్దుటూరు, (పెన్ సత్తా):**కడప జిల్లాలో పర్యటించిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం మధ్యాహ్నం ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక సదుపాయాలను పరిశీలించడంతో పాటు విద్యార్థుల అభ్యసన ఫలితాలు, పాఠశాల పనితీరుపై ఆరా తీశారు. ముందుగా పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులతో మంత్రి సంభాషించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల అందజేత, వాటి నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఇరాన్-అమెరికా యుద్ధాన్ని ఎంతమంది గమనిస్తున్నారని అడిగారు. విద్యతో పాటు శారీరక వ్యాయామం ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు.

**నా భవిష్యత్ మీపై ఆధారపడి ఉంది**

మీకు మార్కులు రాకపోతే నా మార్కులు పోతాయని విద్యార్థులను ఉద్దేశించి ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. నా భవిష్యత్ మీపై ఆధారపడి ఉంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రజాప్రభుత్వం విశేషంగా కృషిచేస్తోంది. అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోంది. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాం, షూ, తల్లికి వందనం పథకాలను అమలుచేస్తోందని వివరించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులను ఆరా తీశారు. ఐవీఆర్ఎస్ ద్వారా తల్లిదండ్రులు ఫీడ్ బ్యాక్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజనం బాగుందని ఈ సందర్భంగా విద్యార్థులు మంత్రి నారా లోకేష్ కు వివరించారు.

**లెర్నింగ్ అవుట్ కమ్స్ పై దృష్టి పెట్టాలి**

పాఠశాల తనిఖీ సందర్భంగా విద్యార్థుల అభ్యసన ఫలితాలపై మంత్రి ఆరా తీశారు. లెర్నింగ్ అవుట్ కమ్స్ లో పాఠశాల 1.3 స్టార్ రేటింగ్ పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ ఏ.ధనలక్ష్మిని మంత్రి ప్రశ్నించారు. ఫార్మాటివ్, సమ్మేటివ్ అసెస్ మెంట్ పై తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని, లెర్నింగ్ అవుట్ కమ్స్ పై దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. పనితీరులో వెనుకబడిన పాఠశాలల పట్ల ఎంఈవోలు దృష్టిపెట్టాలని, 15 రోజులకోసారి సమీక్ష చేయాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు తక్కువగా ఉండటంపైనా మంత్రి ఆరా తీశారు. హాజరుపై ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులను ఆదేశించారు. అనుమతి లేకుండా ఉపాధ్యాయులు గైర్హాజరయ్యే పరిస్థితిని నివారించాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల ఎన్ రోల్ మెంట్ గతేడాది కంటే తక్కువగా ఉండటంపై మంత్రి ఆరా తీశారు. 10 మంది విద్యార్థులు వసతిగృహాలకు, కేజీబీవీలకు తరలివెళ్లడం వల్ల ఎన్ రోల్ మెంట్ తగ్గిందని ప్రిన్సిపాల్ వివరించారు. గతేడాది కంటే అడకమిక్ ఫెర్ఫార్మెన్స్ మెరుగుపడటం పట్ల మంత్రి ప్రశంసించారు.ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఇందుకు ఉపాధ్యాయుల సహకారం కావాలని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్దాం

- గ్రామ,వార్డు సమస్యలను గుర్తించి రాష్ట్ర పార్టీ దృష్టికి తీసుకువెళ్లాలి



**ధర్మవరం, జూలై 15, (పెన్ సత్తా):**గ్రామ వార్డు స్థాయిలలో ప్రజా సమస్యలను గుర్తించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్దామని తెదేపా నాయకులు అన్నారు.రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ సూచనలను అనుసరించి ధర్మవరం పట్టణం గాంధీనగర్ సర్కిల్లో గల తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ధర్మవరం పట్టణ మరియు రూరల్ సమావేశాలను తెదేపా నాయకులు వేరువేరుగా నిర్వహించారు.ఈ సందర్భంగా తెదేపా నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జ్ చింతలపల్లి మహేష్ మరియు ధర్మవరం పట్టణ అధ్యక్షుడు పరిసే సుధాకర్ మాట్లాడుతూ, తెలుగుదేశంపార్టీ నాయకులు తమ గ్రామ వార్డు లలో పర్యటించి ప్రజల మౌలిక సదుపాయాలను వారి వ్యక్తిగత సమస్యలను గుర్తించి నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకువెళ్దామని ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు ముందుకు వెళ్లాలని సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలకు నాయకులు సూచించారు అదేవిధంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ ప్రజాక్షేత్రంలోనే ఉండాలని ప్రజలతో మమేకమవ్వాలని వారు తెదేపా నాయకులకు తెలియజేశారు. అదేవిధంగా రాష్ట్ర పార్టీ ఇచ్చిన ప్రతి ఒక్క కార్యక్రమాన్ని ధర్మవరం నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో దిగ్విజయంగా ముందుకుతీసుకెళుతున్నందుకు నియోజకవర్గ తెదేపా కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. రానున్న డోర్ టు డోర్ కార్యక్రమాన్ని కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు తీసుకువెళ్లి రాష్ట్రంలోనే ధర్మవరం నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో నిలిపే విధంగా అందరూ కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు సూచించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలో గల పలు సమస్యలతో కూడిన తీర్మానాన్ని రాష్ట్ర పార్టీ కార్యాలయానికి పంపారు.ఈ కార్యక్రమంలో పట్టణ మండల కమిటీ సభ్యులు క్లస్టర్ ఇన్చార్జిలు, యూనిట్ ఇన్చార్జులు,తెదేపా కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ భవనంలో స్వాతంత్ర్య సమర యోధురాలు ఘనంగా దుర్గాబాయి దేశ్ ముఖ్ 117వ జయంతి కార్యక్రమం



**గుంతకల్లు, (పెన్ సత్తా):**అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని ఫుట్బాల్ గ్రౌండ్లో స్వాతంత్ర్య సమర యోధురాలు దుర్గా బాయి దేశ్ ముఖ్ 117వ జయంతి పెన్షన ర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ షైక్షా వలి,కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా దుర్గా బాయి దేశ్ ముఖ్ చిత్ర పటానికి కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు పూల మాల వేసి నివాళులర్పించారు. నారాయణరెడ్డి మాట్లాడుతూ వీరు భారత దేశ స్వతంత్ర సమర యోధురాలు,సంఘ సంస్కర్త, రచయిత్రి,సామాజిక కార్యకర్తచెన్నై,హైదరాబాద్ లో ఉన్న ఆంధ్ర మహిళా సభల ను ఆమె స్థాపించింది. ఆమె భారత రాజ్యాంగ సభ,భారత దేశ ప్రణాళిక సంఘ సభ్యు రాలు.ఆమెను భారత దేశంలో సామాజిక సర్వీస్ మదర్ గా పిలిచేవారు. ఆమె నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఉమెన్ ఎడ్యుకేషన్ కు మొదటి చైర్ పర్సన్ గా వ్యవహరించారు. వీరికి 1975లో పద్మ విభూషన్ బిరుదులను ఇచ్చారు. ఆంధ్ర విశ్వ విద్యా లయం నుండి గౌరవ డాక్టరేట్ పొందారు.1971లో నెహ్రూ లిటర సి అవార్డ (వయోజన విద్యా సేవలకు గుర్తింపు గా వచ్చిందని కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు చెప్పారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ షైక్షా వలి,కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు, నారాయణరెడ్డి, చెన్నారెడ్డి, నారాయణ శెట్టి,హస్సన్ అహమ్మద్,మద్దులేటి, ఓబులేసు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల బాలికల పాఠశాలలో ఫుడ్ కమిషన్ సభ్యుడు ఆకస్మిక తనిఖీ

**అమరాపురం (పెన్ సత్తా):**అమరాపురం అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఈ. లక్ష్మి రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫుడ్ ఇన్స్పెక్టర్ షంషీద్ ఖాన్, తూనికల కొలతల అధికారి ,అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్, బీసీ ఎస్సీ వెల్ఫేర్ అధికారుల బృందం, తహసిల్దార్ హనుమంతు, ఎంపీడీవో రామారావు, మండల విద్యాశాఖ అధికారులు సత్యనారాయణ, వెంకటరమణ నాయక్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ విన్సెంట్ పాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వండిస్తున్న భోజనాన్ని పరిశీలించారు.విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, ఒక్కో విద్యార్థికి నిర్దేశించిన పరిమాణంలో ఆహారాన్ని ఇస్తున్నారా అనే విషయాలను పరిశీలించారు.గత సంవత్సరం పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణత శాతం ఎంత అనే వివరాలను ప్రిన్సిపాల్ అపర్ణను అడిగి తెలుసుకున్నారు.



# ప్రాథమిక నివేదికలో కీలక అంశాలు

అయోధ్య రామమందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల దుర్వినియోగ ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మరో 24 నుంచి 48 గంటల్లో ఉత్తర్?ప్రదేశ్ ప్రభుత్వానికి తన తుది నివేదికను సమర్పించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఆ నివేదిక గురువారం లేదా శుక్రవారం ప్రభుత్వానికి అందే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు తెలిపాయి. ఇదే సమయంలో సిట్ దర్యాప్తు గడువును ఇకపై పొడిగించే అవకాశం లేదని కూడా తెలుస్తోంది. ఈ కేసు దర్యాప్తును మరింత విస్తృతంగా చేపట్టేందుకు ఉత్తర్?ప్రదేశ్ ప్రభుత్వం జూలై 1న సిట్‌కు 15 రోజుల గడువు పొడిగించింది. విరాళాల లెక్కింపు ప్రక్రియ, భద్రతా ఏర్పాట్లు, నగదు నిర్వహణ, సంబంధిత సిబ్బంది పాత్ర వంటి అన్ని అంశాలపై సమగ్రంగా విచారణ జరిపిన అనంతరం తుది నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం.

సిట్ ఇప్పటికే సమర్పించిన ప్రాథమిక నివేదికలో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఏప్రిల్ 27 నుంచి జూన్ 5 2026 మధ్య కాలంలో సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా సుమారు 70 అనుమానాస్పద ఘటనలు గుర్తించినట్లు నివేదిక పేర్కొంది. నగదు లెక్కింపు బాధ్యతలు నిర్వహిస్తున్న కొందరు సిబ్బంది నగదు కట్టలను దాచిపెడుతున్న దృశ్యాలు సీసీటీవీలో నమోదైనట్లు అందులో ప్రస్తావించింది. అలాగే విరాళాల దుర్వినియోగానికి దారితీసిన పలు లోపాలను కూడా సిట్ గుర్తించింది. నగదు లెక్కింపు కేంద్రంలోకి ప్రవేశించే సమయంలో, బయటకు వెళ్లే సమయంలో సిబ్బందిని తనిఖీ చేయకపోవడం, వ్యక్తిగత వస్తువులపై సరైన నియంత్రణ లేకపోవడం, వేర్వేరు హుండీల నుంచి వచ్చిన నగదును ఒకేసారి కలిపి లెక్కించడం వంటి అంశాలు ఈ ఘటనకు అవకాశం కల్పించినట్లు ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు.



### నగదు స్వాధీనం

దర్యాప్తు ప్రారంభానికి ముందే కొందరు ఉద్యోగుల వద్ద నుంచి రూ.78.94 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు నివేదిక వెల్లడించింది. అంతేకాకుండా జూన్ 4న నగదు లెక్కింపు గదికి ఆనుకుని ఉన్న బాత్‌రూమ్‌లో మరో రూ.2.25 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సిట్ తెలిపింది. అయితే సోషల్ మీడియాలో ప్రచారంలోకి వచ్చిన వెండి ఇటుకలు, ఇతర విలువైన కానుకలు కనిపించకుండా పోయాయన్న ఆరోపణలకు ఇప్పటివరకు ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లభించలేదని కూడా సిట్ తన నివేదికలో స్పష్టం చేసింది.

### ఎనిమిది మంది నిందితులకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

ఈ కేసులో అరెస్టయిన ఎనిమిది మంది నిందితుల జ్యుడీషియల్ కస్టడీని అయోధ్య కోర్టు మరో 14 రోజుల పాటు పొడిగించింది. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిందితులను కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ నెల 27న వారిని మరోసారి కోర్టు ఎదుట హాజరుపరచనున్నారు. రామజన్మభూమి ఆలయంలో విరాళాల దుర్వినియోగ ఆరోపణలపై స్వతంత్రంగా, న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు ఇటీవల విచారణకు స్వీకరించింది.

ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం, శ్రీరామ్ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌కు నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ తన దర్యాప్తు పురోగతిపై స్థితిగతుల నివేదిక సమర్పించాలని ఆదేశించింది. అలాగే సిట్‌లో ఉన్న సభ్యుల వివరాలను కూడా అందించాలని సూచించింది. ఈ కేసు తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

### ట్రస్ట్‌లో రాజీనామాలు

విరాళాల దుర్వినియోగ ఆరోపణలు వెలుగులోకి వచ్చిన తర్వాత శ్రీరామ్ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ట్రస్ట్ అప్పటి ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌తో పాటు ట్రస్ట్ సభ్యులు అనిల్ మిశ్రా, గోపాల్ రావు రాజీనామాలు చేశారు. ట్రస్ట్ వారి రాజీనామాలను ఆమోదించింది. ఇప్పుడు సిట్ తుది నివేదికపై అందరి దృష్టి నెలకొంది. ఈ నివేదిక ఆధారంగా ఉత్తర్?ప్రదేశ్ ప్రభుత్వం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు సుప్రీంకోర్టు విచారణ, సిట్ నివేదిక, కోర్టులో కొనసాగుతున్న కేసు పరిణామాలు ఈ వ్యవహారంలో కీలకంగా మారనున్నాయి.

# మీ బ్యాంకు లావాదేవీలపై ఐటీ నిఘా..

వేతన జీవులు సైతం తమ సాధారణ బ్యాంకింగ్ లావాదేవీల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ హెచ్చరిస్తోంది. అధిక విలువ కలిగిన కొన్ని రకాల లావాదేవీలు ఆటోమేటిక్ వ్యవస్థల ద్వారా నేరుగా ఐటీ శాఖ దృష్టికి వెళతాయని, ఫలితంగా నోటీసులు వచ్చే ప్రమాదం ఉందని స్పష్టం చేసింది. డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థల ద్వారా ఈ పర్యవేక్షణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది.

ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 285దీూ ప్రకారం, బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు నిర్దేశిత ఆర్థిక లావాదేవీల వివరాలను తప్పనిసరిగా ఐటీ శాఖకు నివేదించాల్సి ఉంటుంది. ఈ సమాచారం పన్ను చెల్లింపుదారుల వార్షిక సమాచార నివేదిక (ూxూ) మరియు ఫామ్ 26ూూలో ప్రతిబింబిస్తుంది. దాఖలు చేసిన ఐటీ రిటర్న్స్‌తో ఈ వివరాలు సరిపోలకపోతే, పన్ను ఎగవేత ఉద్దేశం లేకపోయినప్పటికీ ఐటీ శాఖ నుంచి నోటీసులు వచ్చే అవకాశం ఉంది.




### ఐటీ శాఖ నిఘాలో ఉన్న ప్రధాన లావాదేవీలు

నగదు డిపాజిట్లు: ఒక ఆర్థిక సంవత్సరంలో సేవింగ్స్ ఖాతాలో రూ.10 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ నగదు జమ చేసినట్లయితే, ఆ వివరాలు ఐటీ శాఖకు చేరతాయి. వేర్వేరు సందర్భాల్లో డిపాజిట్ చేసినప్పటికీ, బ్యాంకింగ్ వ్యవస్థలు వాటన్నింటినీ కలిపి లెక్కిస్తాయి.

**క్రెడిట్ కార్డ్ చెల్లింపులు:** క్రెడిట్ కార్డు బిల్లుల చెల్లింపుల కోసం నగదు రూపంలో రూ.1 లక్ష లేదా డిజిటల్ బదిలీల ద్వారా ఏడాదికి రూ.10 లక్షలకు పైగా ఖర్చు చేసినా నిఘా ఉంటుంది. ప్రకటించిన ఆదాయానికి, చేసే ఖర్చులకు పొంతన లేకపోతే ఐటీ శాఖ నుంచి ప్రశ్నలు ఎదుర్కోవాల్సి రావొచ్చు.

**ఆస్తి లావాదేవీలు:** రూ.30 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ విలువైన స్థిరాస్తుల కొనుగోలు లేదా విక్రయ లావాదేవీలను ఆదాయపు పన్ను శాఖ నిశితంగా పరిశీలిస్తుంది.

**నిరుపయోగ ఖాతాలు:** సుదీర్ఘ కాలంగా వాడకంలో లేని ఖాతాలో అకస్మాత్తుగా పెద్ద మొత్తంలో నగదు జమ అయినా లేదా విత్‌డ్రా చేసినా అది ఐటీ శాఖ దృష్టికి వెళుతుంది.

**విదేశీ లావాదేవీలు:** ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.10 లక్షలు దాటిన విదేశీ కరెన్సీ కొనుగోళ్లు, ఇతర అంతర్జాతీయ లావాదేవీలను కూడా అధికారులు నిశితంగా గమనిస్తారు.

ఆర్థిక పారదర్శకతను పెంచడం, పన్ను ఎగవేతలను అరికట్టడమే లక్ష్యంగా ఈ నిబంధనలను కఠినతరం చేశారు. ఆస్తి దస్తావేజులు, రుణాలు, గిఫ్ట్ డీడ్‌లు వంటి సరైన పత్రాలు ఉన్న లావాదేవీలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని నిపుణులు చెబుతున్నారు. అయితే, ఐటీ నోటీసులకు స్పందించకపోయినా లేదా లెక్కలు సరిగా చూపలేకపోయినా చెల్లించాల్సిన పన్నుపై 50 శాతం నుంచి 200 శాతం వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. కాబట్టి, పన్ను చెల్లింపుదారులు జూలై 31 లోపు ఐటీఆర్ దాఖలు చేసే ముందు తమ ూxూను సమీక్షించుకుని, అన్ని ఆదాయ వనరులను కచ్చితంగా వెల్లడించడం ఉత్తమం.


# కర్ణాటకలో కేబినెట్ విస్తరణకు కౌంట్‌డౌన్!

కర్ణాటక రాజకీయాల్లో కేబినెట్ విస్తరణ అంశం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఢిల్లీ పర్యటనతో రాష్ట్ర కాంగ్రెస్‌లో మంత్రి పదవులపై చర్చలు మళ్లీ ఊపందుకున్నాయి. చాలా కాలంగా ఎదురుచూస్తున్న మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానం త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో మంత్రి పదవుల కోసం ఆశగా ఎదురుచూస్తున్న ఎమ్మెల్యేల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. బుధవారం సాయంత్రం ఢిల్లీకి వెళ్లిన డీకే శివకుమార్, కేంద్ర మంత్రులతో భేటీ అవుతారని అధికారిక షెడ్యూల్‌లో పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం ఆయన పార్టీ అగ్రనేతలతో కూడా సమావేశమయ్యే అవకాశముంది. ఇటీవలే కేబినెట్ విస్తరణపై కాంగ్రెస్ హైకమాండ్ అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నట్లు శివకుమార్ వెల్లడించారు. అధిష్ఠానం సమయం ఇచ్చిన వెంటనే ఢిల్లీకి వెళ్తానని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీ పర్యటనకు ముందు డీకే శివకుమార్, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఆయన నివాసంలో కలిసి చర్చలు జరపడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలను శివకుమార్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. కేబినెట్ విస్తరణకు సంబంధించిన అంశాలపైనే ఇద్దరు నేతల మధ్య చర్చలు జరిగాయని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

### భారీ సంఖ్యలో ఖాళీలు

ఇదే సమయంలో సిద్ధరామయ్య కూడా ఢిల్లీకి వెళ్లనున్నట్లు ఆయన కుమారుడు, రాష్ట్ర మంత్రి యతీంద్ర సిద్ధరామయ్య వెల్లడించారు. కేబినెట్ విస్తరణను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని పార్టీ భావిస్తోందన్నారు. రాజ్యసభ, శాసన మండలి ఎన్నికల కారణంగా ఈ ప్రక్రియ ఆలస్యమైందని చెప్పారు. ఇప్పుడు హైకమాండ్ రాష్ట్ర నాయకులను చర్చలకు పిలిచిందని, సమావేశాల అనంతరం మంత్రివర్గ విస్తరణపై నిర్ణయం వెలువడే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం కర్ణాటక మంత్రివర్గంలో భారీ సంఖ్యలో ఖాళీలు ఉన్నాయి. డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 13 మంది మంత్రులతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రంలో మంత్రివర్గ గరిష్ఠ బలం ముఖ్యమంత్రితో కలిపి 34 మంది వరకు ఉండొచ్చు. అంటే ప్రస్తుతం ఇంకా 20 మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. ఈ కారణంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో పదవుల కోసం తీవ్ర పోటీ నెలకొంది. మంత్రి పదవుల కోసం రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది ఎమ్మెల్యేలు, వారి అనుచరులు, సామాజిక వర్గాల ప్రతినిధులు లాబీయింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో మద్దతుదారులు బహిరంగంగా ఆందోళనలు కూడా నిర్వహించారు. బళ్లారిలో కమ్లి ఎమ్మెల్యే జేఎన్ గణేశ్‌కు మంత్రి పదవి ఇవ్వాలని మద్దతుదారులు ర్యాలీలు నిర్వహించిన ఘటన కూడా ఇటీవల చర్చనీయాంశమైంది. అయితే ఇలాంటి ఒత్తిళ్లను కాంగ్రెస్ హైకమాండ్ సీరియస్‌గా తీసుకుంది. జూన్ 24న ఎమ్మెల్యేలు, మఠాధిపతులు, సామాజిక వర్గాల నాయకులు మంత్రి పదవుల కోసం బహిరంగ లాబీయింగ్ చేయవద్దని స్పష్టమైన హెచ్చరిక జారీ చేసింది. నిర్ణయాలు ఒత్తిళ్ల ఆధారంగా కాకుండా పార్టీ అవసరాలు, ప్రాంతీయ సమతుల్యత, సామాజిక ప్రాతినిధ్యం, ప్రజా పనితీరు వంటి అంశాల ఆధారంగానే ఉంటాయని కాంగ్రెస్ నాయకత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కేబినెట్ విస్తరణ కాంగ్రెస్‌కు సవాలుగా మారింది. ఖాళీలు ఎక్కువగా ఉన్నప్పటికీ ఆశావహుల సంఖ్య మరింత ఎక్కువగా ఉంది. అందరికీ అవకాశం కల్పించడం సాధ్యం కాకపోవడంతో అసంతృప్తిని ఎలా నియంత్రిస్తారన్నది పార్టీకి పెద్ద పరీక్షగా మారింది. ముఖ్యంగా లింగాయత, వొక్కలిగ, దళిత, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉంది. అలాగే ఉత్తర కర్ణాటక, దక్షిణ కర్ణాటక ప్రాంతాల మధ్య సమతుల్యత కూడా పాటించాల్సి ఉంటుంది. ఇక బీకే హరిప్రసాద్ వంటి సీనియర్ నేతలకు మంత్రి పదవులు దక్కే అవకాశాలపై కూడా చర్చ జరుగుతోంది.

## పార్లమెంట్‌లో స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్‌గ్లాసులకు నో



జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు జరగనున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో లోక్‌సభ సచివాలయం సభ్యులకు పలు కీలక సూచనలు చేసింది. సమావేశాల సమయంలో భద్రతతో పాటు సభ్యుల వ్యక్తిగత గోప్యతను దృష్టిలో ఉంచుకుని స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్‌గ్లాసులు, పెన్ కెమెరాలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగించవద్దని కోరింది. దేశంలో ప్రస్తుతం సులభంగా అందుబాటులో ఉన్న ఈ స్మార్ట్ పరికరాలను రహస్యంగా చిత్రాలు, వీడియోలు తీయడానికి లేదా ఇతరుల గోప్యతకు భంగం కలిగించే విధంగా ఉపయోగించే అవకాశం ఉందని లోక్‌సభ సచివాలయం పేర్కొంది. ఈ నేపథ్యంలో ఎంపీలు అలాంటి పరికరాలకు దూరంగా ఉండాలని బులెటిన్‌లో విజ్ఞప్తి చేసింది. అలాగే పార్లమెంట్ ఆవరణలో ధర్నాలు, నిరసనలు, ప్లకార్డుల ప్రదర్శన, ఆయుధాల ప్రదర్శన, మతపరమైన కార్యక్రమాల నిర్వహణ వంటి చర్యలు చేపట్టవద్దని స్పష్టం చేసింది. ఏఐ సాయంతో రూపొందించిన చిత్రాలు, పోస్టర్లు, అవమానకర నినాదాలతో కూడిన ప్లకార్డులు, బ్యానర్లను కూడా ప్రదర్శించరాదని పేర్కొంది. సమావేశాల సమయంలో ఇతర సభ్యులు తమ ఛాంబర్లకు సులభంగా వెళ్లేలా పార్లమెంట్ ప్రవేశద్వారాల వద్ద ఎలాంటి ఆందోళనలు, ప్రదర్శనలు నిర్వహించవద్దని ఎంపీలకు సూచించింది. గత బడ్జెట్ సమావేశాల సమయంలో సస్పెన్షన్‌కు గురైన కొందరు ఎంపీలు పార్లమెంట్ గేటు వద్ద నిరసనలు చేపట్టిన నేపథ్యంలో ఆ మార్గదర్శకాలను మరోసారి గుర్తు చేసింది. పార్లమెంట్ కార్యకలాపాలు ప్రశాంతంగా, అంతరాయం లేకుండా సాగేందుకు సభ్యులంతా నిబంధనలు పాటించాలని లోక్‌సభ సచివాలయం కోరింది.

## అమెరికాలో ట్రంప్ చిత్రంతో కొత్త డాలర్ నాణెం




అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం 250వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిత్రంతో కొత్త ఒక డాలర్ (వి1) నాణేన్ని ముద్రించనున్నట్లు యునైటెడ్ స్టేట్స్ మింట్ ప్రకటించింది. ఈ విషయాన్ని ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ బుధవారం వెల్లడించారు. ఈ నాణేనికి ఒకవైపు ట్రంప్ చిత్రం ఉండగా, దానిపై "లిబర్టీ", దిగువన "1776-2026" అనే సంవత్సరాలను ముద్రించారు. చిత్రానికి పక్కన "ఇన్ గాడ్ వుయ్ ట్రస్ట్" అని వాక్యం ఉంటుంది. నాణేనికి రెండో వైపు రెక్కలు విప్పిన గద్ద, దాని మధ్యలో 250వ సంఖ్యతో కూడిన రక్షణ కవచం (షీల్డ్) ఉంటుంది. దానిపై "యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా", "వన్ డాలర్" అనే అక్షరాలు ఉంటాయి. ఈ సందర్భంగా స్కాట్ బెస్సెంట్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, "అమెరికా 250 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకల వేళ, స్వేచ్ఛకు, దేశభక్తికి చిహ్నంగా ఈ కొత్త బంగారు నాణేన్ని యూఎస్ మింట్ ముద్రించనుంది. ట్రంప్ చిత్రంతో కూడిన ఈ నాణెం అమెరికా విలువలను, స్వేచ్ఛను పరిరక్షిస్తామన్న దేశ నిబద్ధతను చాటుతుంది" అని పేర్కొన్నారు. సాధారణంగా అమెరికాలో జీవించి ఉన్న అధ్యక్షుల చిత్రాలను కరెన్సీపై ముద్రించకూడదనే నిబంధన ఉంది. అయితే, 250వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికల కోసం చట్టంలో మినహాయింపులు ఉన్నాయని అధికారులు స్పష్టం చేశారు. గతంలో 1926లో అప్పటి అధ్యక్షుడు కాల్విన్ కూలిడ్జ్ చిత్రంతో నాణేన్ని విడుదల చేసిన ఉదాహరణను ఈ సందర్భంగా గుర్తుచేశారు. ట్రంప్ చిత్రంతో డాలర్ నాణేన్ని ఎప్పుడు విడుదల చేస్తారు, ఎన్ని ముద్రిస్తారు అనే వివరాలను ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదు. కాగా, ఈ నిర్ణయంపై ప్రస్తుతం మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి.

## దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రక్షాళన

దేశంలో ఎన్నికలను మరింత పారదర్శకంగా, కచ్చితత్వంతో కూడిన ప్రక్రియగా మార్చే దిశగా భారత ఎన్నికల సంఘం ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అదే 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' నకిలీ ఓట్లు, చనిపోయిన వారి పేర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలను ఓటర్ల జాబితా నుంచి తొలగించి, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా 'ప్రత్యేక ఓటరు జాబితాల సమగ్ర సవరణ' పేరిట ఈ దేశవ్యాప్త ప్రక్షాళన జరుగుతోంది. ఇప్పటికే రెండు దశల్లో విజయవంతమైన ఈ ప్రక్రియ, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో మూడో దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ూx= అంటే ఏమిటి, అది ఎలా జరుగుతుంది, ఓటర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటో సమగ్రంగా పరిశీలిద్దాం. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనేది ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల జాబితాను సమూలంగా సవరించే ప్రక్రియ. బూత్ లెవల్ అధికారులు (దీూం) ప్రతి ఇంటికీ వెళ్లి, పాక్షికంగా నింపి ఉన్న ఎన్యుమరేషన్ ఫారాలను అందించి, ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధ్రువీకరిస్తారు. దీని ప్రధాన ఉద్దేశం ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో శుద్ధి చేయడం. మరణించిన వారు, ఒకే వ్యక్తికి పలుచోట్ల ఓట్లు ఉండటం (నకిలీ ఓట్లు), శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, పౌరసత్వం లేని వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం ఈ ప్రక్రియలో కీలకం. అదే సమయంలో, అర్హత ఉండి కూడా జాబితాలో పేరు లేని వారిని చేర్చడం ద్వారా స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికల నిర్వహణకు వీలు కల్పించడం ఎన్నికల సంఘం లక్ష్యం.

2025 అక్టోబర్ 27న ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రకటించారు. అయితే, ఈ ప్రక్రియపై కొన్ని రాజకీయ పక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో విషయం సుప్రీంకోర్టుకు చేరింది. 2026 మే నెలలో సర్వోన్నత న్యాయస్థానం దీనిపై స్పష్టతనిచ్చింది. ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రజాప్రాతినిధ్య చట్టానికి అనుగుణంగానే ఉందని, నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించడం ఎన్నికల సంఘం రాజ్యాంగపరమైన బాధ్యత అని పేర్కొంటూ దాని చట్టబద్ధతను సమర్థించింది. మొదటి దశ (బీహార్): ప్రయోగాత్మకంగా తొలి దశను బీహార్‌లో 2025 జూన్-సెప్టెంబర్ మధ్య చేపట్టారు. ఈ పరిశీలన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 47 లక్షల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. ఇది అక్కడి మొత్తం ఓటర్లలో దాదాపు 5-6 శాతానికి సమానం. రెండో దశ (9 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాలు): బీహార్ ప్రయోగం విజయవంతం కావడంతో, రెండో దశను ఛత్తీస్‌గఢ్, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా మొత్తం 9 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో విస్తరించారు. ఈ దశలో సుమారు 51 కోట్ల ఓటర్ల వివరాలను పరిశీలించారు. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 2.04 కోట్ల పేర్లు, పశ్చిమ బెంగాల్‌లో 91 లక్షల పేర్లు జాబితా నుంచి తొలగింపునకు గురయ్యాయి. ఈ ప్రక్రియ కోసం 5.3 లక్షల మంది బీఎల్‌వోలు, 7.64 లక్షల మంది బూత్ లెవెల్ ఏజెంట్లు (దీూాలు) పనిచేశారు.

## కొత్త తరం! కొత్త స్వరం!!

భారత రాజకీయ వ్యవస్థ దశాబ్దాలుగా యువతను భవిష్యత్ కాలంలోనే సంబోధిస్తూ వస్తోంది. యువకులు రేపటి నాయకులు.. ఇదీ నేతల నోట తరచూ వినిపించే మాట. కానీ ఈ ఆశావహ పదజాలం వెనుక దాగిన వాస్తవం వేరు. అధికారం మాత్రం వయోధిక నాయకత్వం చేతుల్లోనే కేంద్రీకృతమై ఉంది. యువతకు నిజమైన ప్రభావం అప్పగించే సాహసం అరుదు. ఆ రాజకీయ కల్పన ఇప్పుడు వేగంగా కరిగిపోతోంది. దేశ యువత ఇకపై 'నిరీక్షణలో ఉన్న పౌరులు' కాదు. వారు ఇప్పటికే ఎన్నికలను ప్రభావితం చేస్తున్నారు. రాజకీయ చర్చను మలుపు తిప్పుతున్నారు. పార్టీలను పునరాలోచనలో పడేస్తున్నారు. అసలు రాజకీయాలు నడిచే తీరునే కొత్తగా నిర్వచిస్తున్నారు. భారత యువత తనదైన భాష, అంచనాలు, పద్ధతులు, ప్రభావ కేంద్రాలతో స్వతంత్ర రాజకీయ శక్తిగా ఆవిర్భవిస్తోంది. ఈ పరివర్తన అత్యంత స్పష్టంగా కనిపిస్తున్నది.. రాజకీయ సమాచార రంగంలోనే. స్వాతంత్ర్యానంతర దశాబ్దాల్లో భారత రాజకీయం అధికార శ్రేణి, దూరం అనే రెండు స్తంభాలపై నడిచింది. నేతలు ఎత్తైన వేదికలపై నుంచి ప్రసంగించేవారు. ప్రజలు కింద కూర్చుని వినేవారు. సమాచారం పార్టీ నిర్మాణాలు, పత్రికలు, టీవీల ద్వారా ప్రవహించేది. ఆడంబరం, సంస్థాగత నియంత్రణ, సైద్ధాంతిక నిశ్చయతలపై ఆధారపడిన ఆ నమూనా ఇప్పుడు బలహీనపడుతోంది. నేటి యువత షార్ట్ వీడియోలు, మీమ్స్, పాడ్‌కాస్ట్‌లు, లైవ్ స్ట్రీమ్‌లు, వికేంద్రీకృత డిజిటల్ సమూహాలతో రూపుదిద్దుకున్న పూర్తి భిన్న ప్రపంచంలో జీవిస్తోంది. దృష్టి నిలిపే వ్యవధి తగ్గినా రాజకీయ చైతన్యం తగ్గలేదు. యువ ఓటర్లు రాజకీయ వ్యతిరేకులు కారు, నటనకు వ్యతిరేకులు. స్క్రిప్టెడ్ ఉపన్యాసాలకంటే అందుబాటుతనం, నిజాయితీ, స్పందనశీలత, హాస్యం, పారదర్శకతలకే స్పందిస్తారు. ఈ మార్పునకు తమిళనాడు స్పష్టమైన ఉదాహరణ. నటుడినుంచి నేతగా ఎదిగిన విజయ్ ప్రస్థానాన్ని కేవలం సినీ గ్లామర్‌తో వివరించలేం. మారిన సమాచార వ్యవస్థను సహజంగా అర్థం చేసుకోవడమే ఆయన రాజకీయ ప్రాధాన్యానికి మూలం. ఒకప్పుడు పనికిమాలిన ఇంటర్నెట్ సంస్కృతిగా కొట్టిపారేసిన మీమ్ వ్యాఖ్యానాలు, వ్యంగ్య వేదికలు నేడు అభిప్రాయ నిర్మాణానికి సమాంతర క్షేత్రాలుగా పనిచేస్తున్నాయి.


యువ రాజకీయం ఇకపై పార్టీల యువజన విభాగాలకో, క్యాంపస్ ఎన్నికలకో పరిమితం కాలేదన్నది రెండో కీలక పరిణామం. 2017నాటి జల్లికట్టు అనుకూల ఉద్యమం ఈ విషయంలో చారిత్రక మలుపు. కేంద్రీకృత నాయకత్వం లేకుండానే డిజిటల్ అనుసంధానం గల యువత భారీ ప్రజా సమీకరణను నిలబెట్టగలదని ఆ ఉద్యమం నిరూపించింది. అందుకే -పార్టీలు ఇప్పుడు ఆన్‌లైన్ సెంటిమెంట్‌ను నిరంతరం గమనిస్తూ, డిజిటల్ స్పందనలకు అనుగుణంగా ప్రచార సందేశాలను సవరించుకుంటున్నాయి. 'ఆన్‌లైన్ రాజకీయం', 'వాస్తవ రాజకీయం' మధ్య విభజన రేఖ చెరిగిపోతోంది. ఈ ధోరణి దక్షిణాసియా అంతటా కనిపిస్తోంది. 2022 నాటి శ్రీలంక 'అరగలయ' ఉద్యమం.. అవినీతి, వారసత్వ రాజకీయాలపై ప్రజాగ్రహాన్ని డిజిటల్ యువత నిరంతర రాజకీయ ఒత్తిడిగా ఎలా మార్చగలదో చూపింది. నేపాల్‌లోనూ పాలనా వైఫల్యాలు, నిరుద్యోగంపై యువ ఉద్యమాలు పెరుగుతున్నాయి. భారత్ అటువంటి భారీ సంక్షోభాలకు దూరంగా ఉన్నా.. ఇక్కడ నిశ్శబ్ద పరివర్తన సాగుతోంది. వీధి ఉద్యమాలుగా కాకున్నా.. రాజకీయ సమాచారం, భాగస్వామ్యం, ఓటరు ప్రవర్తనల్లో మారుతున్న ధోరణుల రూపంలో వ్యక్తమవుతోంది. ఇక్కడే మరో కీలక ప్రశ్నకూ సమాధానముంది. యువ సమీకరణ అంటే వ్యవస్థ వ్యతిరేకత అని భావించడం పొరపాటు. ప్రజాస్వామ్య సంస్థలు విశ్వసనీయంగా ఉండి, ఎన్నికల భాగస్వామ్యం అర్థవంతంగా అనిపించినప్పుడు.. యువత వ్యవస్థను తిరస్కరించకుండా అందులోనే పనిచేసేందుకు సిద్ధంగా ఉంటుందని తమిళనాట పరిణామాలు సూచిస్తున్నాయి. అసలు సమస్య యువతలో నిరాసక్తత కాదు.. సంస్థలపై అపనమ్మకం. 'యువ భాగస్వామ్యం' పేరిట జరుగుతున్నదంతా నిజమైన అధికార పంపిణీ లేని నియంత్రిత భాగస్వామ్యమేనని యువ పౌరులు గుర్తిస్తున్నారు. యువతను రాజకీయాల్లోకి తీసుకురావాలని పార్టీలు మాట్లాడతాయిగానీ.. అధికార పునఃపంపిణీ, నాయకత్వ మార్గాల ఏర్పాటు, అభ్యర్థుల ఎంపికలో వికేంద్రీకరణ, విధాన నిర్ణయాల్లో యువ గళాలకు చోటువంటి తార్కిక పర్యవసానాలను అంగీకరించవు. వేదికపై యువ

## సంపాదకీయం

ముఖాలు, తెరవెనుక పాత పెత్తనం.. ఈ ద్వంద్వ నీతిని ఇట్టే పసిగడుతోంది. ఈ నేపథ్యంలో పార్టీల ముందున్న సవాలు స్పష్టం.. మారాలి, లేదంటే మారిపోవాలి.

నిజాయితీ, భాగస్వామ్యం, పారదర్శకత, స్పందనశీలత, వికేంద్రీకృత ప్రభావంతో రూపొందుతున్న కొత్త ప్రజాస్వామ్య సంస్కృతికి అనుగుణంగా పాతుకుపోయిన రాజకీయ నిర్మాణాలు అధికారాన్ని పంచుకోవడానికి సిద్ధమేనా? ఇది సైద్ధాంతిక ప్రశ్న కాదు.. మనుగడ ప్రశ్న. దేశ జనాభాలో సగానికి పైగా 30 ఏళ్లలోపు వారేనన్న వాస్తవం దృష్ట్యా.. ఈ తరం విశ్వాసం చూరగొనలేని పార్టీ భవిష్యత్తులో నిలదొక్కుకోవడం అసాధ్యం. మన చట్టసభల్లో యువ ప్రజాప్రతినిధుల సంఖ్య జనాభా నిష్పత్తికి అనుగుణంగా లేకపోవడం ఈ అంతరానికి నిదర్శనం. యువ దేశానికి వయోధిక నాయకత్వమన్న వైరుధ్యం ఎంతకాలం కొనసాగుతుందన్నది ఆలోచనీయం. అదే సమయంలో యువతకూ బాధ్యత ఉంది. మీమ్‌లు, ఆన్‌లైన్ చర్చలు రాజకీయ చైతన్యానికి కొత్త వాహికలైనప్పటికీ.. తప్పుడు సమాచారం, ఉపరితల విశ్లేషణల ఉచ్చులో పడకుండా విమర్శనాత్మక ఆలోచన అలవర్చుకోవాలి. డిజిటల్ ఆగ్రహం ఓటుగా, ఓటు నిర్మాణాత్మక భాగస్వామ్యంగా పరిణమించినప్పుడే ఈ శక్తికి సార్థకత. వీధి ఉద్యమం, పోలింగ్ బూత్ ఇకపై వేర్వేరు ప్రజాస్వామ్య క్షేత్రాలు కావు.. అవి పరస్పరం అనుసంధానమవుతున్నాయి. ఈ పరివర్తన పట్టని పార్టీల ఉనికి మాయమే. కాలం మారింది.. తరం మారింది.. వేదిక మారింది.. భాష మారింది. వినే ఓపిక, పంచుకునే హృదయం, మారే సంసిద్ధత ఉన్న నాయకత్వమే రేపటి రాజకీయ చిత్రపటంలో నిలుస్తుంది. యువ భారతం తలుపు తట్టడం లేదు.. తెరుచుకుని లోపలికి వచ్చేస్తోంది. దాన్ని ఆహ్వానించడమా, అడ్డుకుని చరిత్ర పుటల్లో మిగిలిపోవడమా అన్నది రాజకీయ పార్టీల ఎంపిక. ప్రశ్నించే యువత ఉన్న దేశంలోనే ప్రజాస్వామ్యం సజీవంగా ఉంటుంది. ఆ ప్రశ్నలకు జవాబిచ్చే వినయం, వాటిని విధానాలుగా మలిచే విజ్ఞత పాలకవర్గం అలవర్చుకుంటే.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం, అత్యంత యువ ప్రజాస్వామ్యంగానూ వికసిస్తుంది!

### పనికొచ్చే పలుకు



## పుస్తకమే.. పదునైన నేస్తం!

"నేను తిన్న ఆహారాన్ని ఎలా గుర్తుంచుకోలేనో, అలాగే చదివిన పుస్తకాలను కూడా పూర్తిగా గుర్తుంచుకోలేను. కానీ, అవన్నీ కలిసి నన్ను ఈ స్థాయికి చేర్చాయి" అంటారు ప్రముఖ అమెరికన్ తత్వవేత్త, వ్యాసకర్త రాల్ఫ్ వాల్డో ఎమర్సన్. ఎంత లోతైన మాట ఇది! నిన్న మధ్యాహ్నం ఏం తిన్నామో మనలో చాలామందికి గుర్తుండదు. మొన్న తిన్న భోజనం సంగతి అసలే గుర్తురాదు. కానీ ఆ ఆహారమే మన శరీరానికి శక్తినిచ్చింది.. రక్తంగా మారింది.. ఎముకలను బలపరిచింది.. మనల్ని నిలబెట్టింది. ఆహారం కనిపించకుండా శరీరాన్ని నిర్మించినట్టే.. పుస్తకాలు కనిపించకుండా మన వ్యక్తిత్వాన్ని నిర్మిస్తాయి. చదివిన ప్రతి పేజీ గుర్తుండకపోవచ్చు.. కానీ ఆ పేజీలు మనలో నాటిన ఆలోచనలు, పెంచిన అవగాహన, మార్చిన దృక్పథం మాత్రం మనతోనే ఉండిపోతాయి. అదే పుస్తక పఠనం చేసే నిశ్శబ్ద మహిమ.

మనిషి జీవన విధానాన్ని గమనిస్తే.. ప్రతిరోజూ శరీరానికి మూడు పూటలా ఆహారం అందిస్తాం. కానీ మనసుకు, మెదడుకు ఆహారం అందించే విషయంలో మాత్రం నిర్లక్ష్యం చేస్తాం. శరీరం ఆకలేస్తే కడుపు గుర్తుచేస్తుంది.. మనసు ఆకలిని మాత్రం మనమే గుర్తించాలి. ఆ ఆకలికి సరైన ఆహారం పుస్తకమే. ఒక మంచి పుస్తకం చదవడం అంటే ఒక మహానుభావుడి జీవితానుభవాన్ని కొన్ని గంటల్లో సొంతం చేసుకోవడమే. ఒక రచయిత దశాబ్దాల పరిశోధన, అనుభవసారం, ఆలోచనా మథనం.. అంతా కొన్ని వందల పేజీల్లో మనకు దక్కుతుంది. అందుకే "చదివే మనిషి వెయ్యి జీవితాలు జీవిస్తాడు.. చదవని మనిషి ఒక్కటే జీవిస్తాడు" అంటారు పెద్దలు. చరిత్రలో మహోన్నత శిఖరాలను అధిరోహించిన వారందరి జీవితాల్లో పుస్తకాలదే ప్రధాన పాత్ర. అబ్దుల్ కలాం నుంచి అంబేద్కర్ వరకు, గాంధీజీ నుంచి వివేకానందుడి వరకు.. వారి ఆలోచనా విప్లవాలకు పునాదులు వేసింది గ్రంథాలయాలే. అంబేద్కర్ అయితే పుస్తకాల కోసం తిండి ఖర్చులు సైతం తగ్గించుకున్న సందర్భాలున్నాయంటే.. అక్షరం విలువను ఆయన ఎంతగా గుర్తించారో అర్థమవుతుంది.

ఇక జీవనశైలిని మార్చుకోవాలనుకునే వారికి పుస్తకం మించిన మార్గదర్శి లేదు. మారాలన్న తపన ఉన్నా.. ఎలా మారాలో తెలియక చాలామంది అక్కడే ఆగిపోతారు. సరైన పుస్తకం ఆ దారిని చూపిస్తుంది. క్రమశిక్షణ లోపించిందా.. అలవాట్లపై రాసిన పుస్తకాలు దిక్సూచిలా నిలుస్తాయి. ఆత్మవిశ్వాసం సన్నగిల్లిందా.. స్ఫూర్తి గాథలు ధైర్యాన్ని నూరిపోస్తాయి. ఆర్థిక ప్రణాళిక తెలియదా.. ఆ రంగ నిపుణుల రచనలు పాఠాలు చెబుతాయి. ఒత్తిడి వేధిస్తోందా.. మనసును తేలికపరిచే సాహిత్యం ఔషధంలా పనిచేస్తుంది. రోజూ పది పేజీలు చదివే చిన్న అలవాటు.. ఏడాదికి పది పుస్తకాలుగా, పదేళ్లకు వంద పుస్తకాలుగా మారి మనిషిని సరికొత్త వ్యక్తిగా తీర్చిదిద్దుతుంది. నిద్రకు ముందు అరగంట ఫోన్ బదులు పుస్తకం పట్టుకుంటే.. మెరుగైన నిద్రతో పాటు మేలైన ఆలోచనలూ సొంతమవుతాయి. పైగా చదివేవాడి మాటల్లో పదును, రాతల్లో స్పష్టత, నిర్ణయాల్లో పరిణతి దానంతటదే వచ్చి చేరుతుంది. నలుగురిలో నిలబడి మాట్లాడే ధీమా పెరుగుతుంది. ఈ డిజిటల్ యుగంలో క్షణక్షణానికీ రీళ్లు, షార్ట్స్ మన ఏకాగ్రతను ముక్కలు చేస్తుంటే.. గంటసేపు ఒకే పుస్తకంతో గడపగలగడం అన్నది గొప్ప మానసిక వ్యాయామం. అది ఏకాగ్రతను, ఓర్పును, లోతుగా ఆలోచించే శక్తిని తిరిగి ప్రసాదిస్తుంది. కాబట్టి తిన్నదేదో గుర్తులేకపోయినా శరీరం ఎదిగినట్టు.. చదివిందేదో మరిచిపోయినా మనసు ఎదుగుతుందన్న ఎమర్సన్ మాటను నమ్మండి. రోజూ కాసేపు అక్షరాలతో స్నేహం చేయండి. ఆ స్నేహం మీ జీవితాన్ని నిశ్శబ్దంగా.. కానీ నిశ్చయంగా ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది!


# అభివృద్ధికి అడ్డంకుల తొలగింపు



పరిపాలన అంటే ఫైళ్ల ప్రవాహం కాదు.. ప్రజల జీవితాల్లో మార్పుతెచ్చే నిరంతర ప్రక్రియ. ఈ ప్రాథమిక సత్యాన్ని విస్మరించిన వ్యవస్థలు ఎంత గొప్ప పాలసీలు తెచ్చినా కాగితాలకే పరిమితం. దస్త్రాల అనుమతుల పేరిట అభివృద్ధి ఆలస్యం కాకూడదంటూ.. బిజినెస్ రూల్స్‌ను సమూలంగా ప్రక్షాళన చేయాలంటూ సీఎం చంద్రబాబు అధికార యంత్రాంగానికి ఇచ్చిన ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వృథా ప్రక్రియలు తొలగించి, సాంకేతికత సాయంతో పాలనను వేగవంతం చేయాలన్న పాలకుడి సంకల్పం.. దశాబ్దాలుగా పాతుకుపోయిన 'ఫైలు సంస్కృతి'పై ఎక్కుపెట్టిన అస్త్రమే. నిజానికి ప్రస్తుత పరిపాలనా నియమావళి చాలావరకు బ్రిటిష్ కాలంనాటి ఆలోచనా ధోరణిలో భాగమే. అనుమానమే ప్రాతిపదికగా, నియంత్రణే లక్ష్యంగా రూపొందిన నిబంధనలు.. వేగం, పారదర్శకత, జవాబుదారీతనం ప్రామాణికాలుగా మారిన నేటి యుగానికి ఏమాత్రం సరిపోవు. చిన్న అనుమతి కోసం ఫైలు పది టేబుళ్లు తిరగడం, ప్రతి టేబుల్ వద్దా వారాల తరబడి నిరీక్షణ, చివరకు ఎవరిదీ కాని బాధ్యత.. ఇదీ మన కార్యాలయాల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న దృశ్యం! ఈ జాప్యంవల్ల నష్టపోయేది సామాన్య పౌరుడే కాదు.. పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, చివరకు రాష్ట్ర ఆర్థిక ప్రగతి కూడా. అందుకే బిజినెస్ రూల్స్ పునర్లిఖనానికి కమిటీ వేయాలన్న ముఖ్యమంత్రి నిర్ణయం కేవలం సాంకేతిక సవరణ కాదు.. పాలనా తత్వంలోనే మౌలిక మార్పునకు నాంది. అవకాశాలను అందిపుచ్చుకునేందుకు వీలుగా సరళతను పెంచే సంస్కరణలు తేవాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల్లో స్పష్టమైన దార్శనికత కనిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులు క్షణాల్లో ఖండాంతరాలు దాటుతున్న వేళ.. అనుమతుల కోసం నెలల తరబడి ఎదురుచూసే వాతావరణం ఉన్న ప్రాంతాలవైపు ఏ పారిశ్రామికవేత్తా కన్నెత్తి చూడడు. సింగపూర్, దుబాయ్‌వంటి ప్రాంతాలు ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానాలుగా ఎదిగింది వనరుల గొప్పతనంతో కాదు.. ప్రక్రియల సరళత్వంతో, నిర్ణయాల వేగంతో! టెక్నాలజీ వినియోగంలో ముందుండే ముఖ్యమంత్రిగా పేరున్న చంద్రబాబు.. రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ కేంద్రం నుంచి వివిధ శాఖల పౌర సేవలను ప్రత్యక్షంగా సమీక్షించడం ఆ సాంకేతిక దృక్పథానికి కొనసాగింపే. డేటా ఆధారిత పాలన, నిరంతర పర్యవేక్షణ, తక్షణ దిద్దుబాటు.. ఈ మూడూ కలిస్తేనే ఆధునిక పరిపాలన. అయితే సాంకేతికత ఎంత అధునాతనమైనా.. దాన్ని నడిపే వ్యవస్థల ఆలోచనా ధోరణి మారకపోతే ఫలితం శూన్యం. అందుకే నిబంధనల ప్రక్షాళనతో పాటు అధికార యంత్రాంగం మనస్తత్వంలోనూ మార్పు రావాల్సిన అవసరాన్ని ఈ సందర్భం గుర్తుచేస్తోంది.

సీఎం సమీక్షలో ప్రస్తావనకు వచ్చిన మరో కీలకాంశం.. క్రియాశీల పాలన (ప్రోయాక్టివ్ గవర్నెన్స్). ప్రజలు సమస్యలతో ప్రభుత్వం వద్దకు వచ్చే వరకు వేచిచూడటం పాత పద్ధతి. సమస్యను ముందే గుర్తించి పరిష్కరించడం, పథక ఫలాలు చిట్టచివరి వ్యక్తికీ చేరేలా చూడటం నవతరం పాలనా విధానం. ఇందుకు సీనియర్ అధికారుల సమర్థ నాయకత్వం అత్యవసరమన్న ముఖ్యమంత్రి వ్యాఖ్య.. యంత్రాంగంపై బాధ్యతను స్పష్టంగా నిర్దేశించింది. ప్రభుత్వ సేవల్లో 'పౌర సంతృప్తి' అనే కొలమానాన్ని కేంద్రస్థానంలో నిలపడం.. ప్రజలను లబ్ధిదారులుగా కాక వినియోగదారులుగా, భాగస్వాములుగా చూసే దృక్పథానికి సంకేతం. ఇక 2017తో పోలిస్తే రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) 20 శాతం వృద్ధి నమోదు చేసిందని ముఖ్యమంత్రి వెల్లడించడం ఆర్థిక పురోగతికి సూచిక. అయితే గణాంకాల వృద్ధి ఎంత ముఖ్యమో.. ఆ వృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకూ పంపిణీ కావడం అంతకంటే ముఖ్యం. విభజన నష్టాలు, రాజధాని నిర్మాణ భారం, అప్పుల ఒత్తిడివంటి సవాళ్ల మధ్య రాష్ట్రం ముందడుగు వేయాలంటే.. ప్రతి రూపాయి వ్యయం గరిష్ఠ ఫలితాన్నివ్వాలి. అందుకు పాలనా సామర్థ్యమే కీలకం. రైతుల విషయంలోనూ సీఎం సమీక్ష స్పృశించిన అంశాలు ప్రస్తావనార్హం. యూరియా లభ్యతను ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి పర్యవేక్షించడం, రైతు సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా సద్వినియోగంపై అవగాహన కల్పించాలని, దుర్వినియోగాన్ని అరికట్టాలని ఆదేశించడం.. వ్యవసాయ రంగంపై ప్రభుత్వ శ్రద్ధకు నిదర్శనం. అలాగే, అగ్నిమాపక సేవల ప్రమాణాలు పెంచాలన్న ఆదేశం.. పట్టణీకరణ వేగంగా సాగుతున్న రాష్ట్రంలో ప్రజా భద్రతకు సంబంధించిన ముందుచూపు.

ఈ సమీక్షలో అందరి దృష్టినీ ఆకర్షించిన అంశం.. ఆలయాలను వృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్న ప్రతిపాదన. రాష్ట్రంలోని 21 ప్రధాన ఆలయాలకు అపార సామర్థ్యం ఉందని, వాటిని ఆర్థిక కార్యకలాపాలు, పర్యాటకాన్ని పెంచే వృద్ధి కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రసాదాల నాణ్యత పెంచాలని, ఆలయాల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని బలోపేతం చేయాలని దేవదాయ శాఖను ఆదేశించారు. నిజానికి ఆధ్యాత్మిక పర్యాటకం ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న రంగం. తిరుమల నుంచి కాశీ వరకు.. పుణ్యక్షేత్రాల చుట్టూ అల్లుకున్న ఆర్థిక వ్యవస్థ లక్షలాది కుటుంబాలకు జీవనాధారం. రవాణా, వసతి, భోజన సదుపాయాలు, చేతివృత్తులు, స్థానిక ఉత్పత్తులు.. ఇలా ఒక్కో ఆలయం చుట్టూ విస్తరించే ఉపాధి వలయం అపారమైనది. శ్రీశైలం, సింహాచలం, అన్నవరం, కాణిపాకం, ద్వారకా తిరుమల, శ్రీకాళహస్తి వంటి క్షేత్రాలున్న ఆంధ్రప్రదేశ్‌కు ఈ నమూనా అనుసరణీయమే. అయితే ఇక్కడో సున్నిత సమతుల్యత అవసరం. ఆలయం అంటే ముందుగా అది భక్తి క్షేత్రం.. ఆ తర్వాతే ఆర్థిక వనరు. వాణిజ్య దృష్టి శ్రుతిమించితే ఆధ్యాత్మిక పవిత్రత దెబ్బతింటుంది. అభివృద్ధి పేరిట ఆలయ ప్రాంగణాల ప్రశాంతతకు భంగం కలగకుండా.. భక్తుల సౌకర్యాలు, పరిశుభ్రత, దర్శన సులభత, ప్రసాద నాణ్యత వంటి ప్రాథమిక అంశాలపైనే తొలి దృష్టి నిలపాలి. ఆధ్యాత్మిక వాతావరణాన్ని బలోపేతం చేయాలన్న ముఖ్యమంత్రి సూచన ఈ సమతుల్యతను గుర్తించినట్లుగానే భావించాలి. మొత్తంగా చూస్తే.. ఈ సమీక్ష ఒక సమగ్ర పాలనా దృక్పథాన్ని ఆవిష్కరించింది. నిబంధనల సంస్కరణ నుంచి ఆలయాభివృద్ధి వరకు, ఎరువుల సరఫరా నుంచి ఫిర్యాదుల పరిష్కారం వరకు.. అన్నింటినీ ఏకసూత్రంగా అనుసంధానించేది 'ప్రజల జీవన సౌలభ్యం' అనే లక్ష్యమే. అయితే సంకల్పానికి, సాకారానికి మధ్య ఉండే దూరాన్ని కప్పివేసేది అమలు తీరే. బిజినెస్ రూల్స్ పునర్లిఖన కమిటీ నిర్ణీత గడువులోగా నివేదిక ఇవ్వాలి. ఆ సిఫార్సులు మళ్లీ ఫైళ్ల మధ్య నలిగిపోకుండా చట్టబద్ధ రూపం దాల్చాలి. సంస్కరణల ఫలితాలను కొలిచే పారదర్శక కొలమానాలు ఏర్పడాలి. అప్పుడే 'ఫైళ్ల పాలన' నుంచి 'ఫలితాల పాలన'కు రాష్ట్రం నిజంగా మళ్లినట్లు. వేగవంతమైన నిర్ణయాలు, జవాబుదారీ యంత్రాంగం, సాంకేతిక పర్యవేక్షణ.. ఈ త్రివేణి సంగమమే నవ్యాంధ్ర భవితకు బాటలు వేస్తుంది. దస్త్రాల దుమ్ము దులిపి, ప్రక్రియల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన ఈ సంస్కరణ యజ్ఞం.. ప్రకటనల స్థాయి దాటి క్షేత్రస్థాయి వాస్తవంగా మారాలని, ఆ మార్పు ఫలాలు కడసారి వరుసలో నిలిచిన సామాన్యుడికీ అందాలని ఆశిద్దాం. అదే జరిగిననాడు.. వేగమే వికాసమన్న నినాదం నినాదంగా మిగలదు, రాష్ట్ర ప్రగతి ప్రస్థానానికి చోదకశక్తిగా నిలుస్తుంది. ■




30 ఏళ్ల వయసులో ఒక మంచి జీతం వచ్చే ఉద్యోగాన్ని సంపాదించి ఉంటే.. ఆర్థిక విషయాల్లో ఇతరుల మాటలు విని తొందరపడకండి. మీ ఎదుగుదలను అడ్డుకునేలా ఎలాంటి అప్పులూ చేయకండి. గతంలో కోల్పోయిన సమయాన్ని భర్తీ చేయాలనే ఆరాటంలో మిమ్మల్ని మీరు ఇబ్బందుల్లో పడేసుకోకండి. ఎందుకంటే, చాలామంది తక్కువ సమయంలో ఎక్కువ సాధించాలనే తొందరలోనే ఆర్థిక సమస్యల్లో చిక్కుకుంటారు. సంపద అంటే వేగంగా పోగేసుకునేది కాదు.. ఓపికగా పెంచుకునేది. నిలకడగా వేసే చిన్న అడుగులే.. కాలక్రమంలో పెద్ద ఆర్థిక భద్రతగా మారతాయి.

-మహాదేవ

### వింతల్లో వింతలు

## అద్దెకు బార్బెక్యూ ఫ్రెండ్!



బార్బెక్యూ చేసుకోవాలని ఉన్నా, కూర్చుని కబుర్లు చెప్పే తోడు లేదా? రష్యాలో ఆ సమస్యకూ పరిష్కారం దొరికేసింది! ఒంటరిగా ఉన్నవారికి బార్బెక్యూ కంపెనీ ఇచ్చేందుకు 'అద్దె స్నేహితులు' అక్కడి ఆన్‌లైన్ క్లాసిఫైడ్స్‌లో దొరుకుతున్నారు. రోజుకు వెయ్యినుంచి ఐదు వేల రూబిళ్లు (రూ. 1,100 నుంచి రూ. 5,500) చెల్లిస్తే చాలు.. వీళ్లు వచ్చి బార్బెక్యూ సిద్ధం చేస్తారు. మాంసం గ్రిల్ చేస్తారు. టెంట్ వేస్తారు. జోకులేసి నవ్విస్తారు! "బార్బెక్యూ, క్యాంపింగ్ ఏర్పాట్లలో సాయం చేస్తా.. జోకులు ఫ్రీ" అంటూ మాస్కోకు చెందిన ఆర్టెమ్ అనే వ్యక్తి ప్రకటన పెట్టడం విశేషం. బిల్లు మీరు కడితే.. స్పాట్ వెతకడం, సరుకుల కొనుగోలు బాధ్యత తామే చూసుకుంటామనే వాళ్లూ ఉన్నారు. అయితే ఇదంతా పక్కా వ్యాపారమే.. శాశ్వత స్నేహం ఆశించొద్దని ముందే తేల్చిచెబుతారట! మళ్లీ కలవాలంటే మళ్లీ ఫీజు కట్టాల్సిందే. మాస్కో, క్రాస్నోదర్, నిజ్నీ నొవ్‌గొరోద్ ప్రాంతాల్లో ఈ 'అద్దె దోస్తీ'కి భలే గిరాకీ ఉందట మరి!

# ఫైనల్లో అర్జెంటీనా

## సెమీస్‌లో 2-1తో ఇంగ్లాండ్‌పై విజయం



అట్లాంటా: అర్జెంటీనా అదరహో. ఈ డిఫెండింగ్ ఛాంపియన్ వరుసగా రెండోసారి ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఫైనల్లో అడుగుపెట్టింది. సెమీఫైనల్లో మెస్సి జట్టు 2-1 తో ఇంగ్లాండ్‌పై విజయం సాధించింది. అర్జెంటీనా తరపున ఎంజో ఫెర్నాండెజ్ (85వ), లాతరో మార్టినెజ్ (90o2) గోల్స్ కొట్టారు. ఇంగ్లాండ్ జట్టులో గోర్డాన్ (55వ) స్కోర్ చేశాడు. అంతకుముందు ఆడిన రెండు నాకౌట్ మ్యాచ్‌ల్లోనూ చెమటోడ్చిన అర్జెంటీనా.. ఈసారి చక్కని ప్రదర్శన చేసింది. ఫైనల్లో ఆ జట్టు స్పెయిన్‌ను ఢీకొంటుంది. క్వార్టర్స్‌లో స్పెయిన్.. ఫ్రాన్స్‌పై గెలిచిన సంగతి తెలిసిందే. అర్జెంటీనా ఇంతకుముందు 1978, 1986, 2022లో ప్రపంచకప్ గెలిచింది. 1930, 1990, 2014లో రన్నరప్‌గా నిలిచింది. ఆ జట్టు స్టార్ మెస్సి (8 గోల్స్) ఈసారి గోల్డెన్ బూట్ రేసులో ముందున్నాడు. మరోవైపు రెండో ప్రపంచకప్ కోసం ఆరాటపడ్డ ఇంగ్లాండ్‌కు నిరాశ తప్పలేదు. ఆ జట్టు 1966లో కప్పు గెలిచింది. ఆ తర్వాత ఎప్పుడూ ఫైనల్ చేరలేదు.

## ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్.. టాప్-10లోకి అక్షర్




దుబాయ్: ఇంగ్లాండ్‌తో తొలి వన్డేలో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన అక్షర్ పటేల్.. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో మెరుగయ్యాడు. వన్డే ఆల్‌రౌండర్ల జాబితాలో 3 స్థానాలు మెరుగుపరుచుకుని 9వ ర్యాంకుకు చేరుకున్నాడు. తొలి వన్డేలో బౌలింగ్‌లో 4 వికెట్లు పడగొట్టిన అతడు.. ఛేదనలో చక్కటి ఇన్నింగ్స్ (52 బంతుల్లో 57)తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అక్షర్ బ్యాటింగ్ (18 స్థానాలు)లో 73వ, బౌలింగ్ (2)లో 42వ ర్యాంకుల్లో ఉన్నాడు.అజేయ అర్ధసెంచరీతో రాణించిన వాషింగ్టన్ సుందర్ (52 నాటౌట్) ఆల్‌రౌండర్ల జాబితాలో 16 స్థానాలు ఎగబాకి 55వ ర్యాంకుకు చేరుకున్నాడు. కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన శుభ్‌మన్ గిల్ (80) 12 పాయింట్లు మెరుగయ్యాడు. అతడు ప్రస్తుతం 803 పాయింట్లతో బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. న్యూజిలాండ్ ఆటగాడు డరైల్ మిచెల్ (814) అగ్రస్థానంలో ఉన్నాడు.

# సిరీస్.. సాధిస్తారా?

### నేడు ఇంగ్లాండ్‌తో భారత్ రెండో వన్డే

### కెప్టెన్ గిల్ ఫిట్‌నెస్‌పై అనుమానాలు

### సాయంత్రం 5.30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో

**టీ20ల్లో ఐర్లాండ్, ఇంగ్లాండ్ చేతుల్లో వరుస పరాజయాల అనంతరం వన్డే సమరాన్ని విజయంతో ఆరంభించిన భారత్.. ఇప్పుడు సిరీస్‌పై గురిపెట్టింది. ఇంగ్లాండ్‌తో గురువారం జరిగే రెండో వన్డేలో విజయం సాధించి.. మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను చేజిక్కించుకోవాలని టీమ్‌ఇండియా చూస్తోంది. అయితే తొలి వన్డేలో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఫిట్‌నెస్‌పై అనుమానాలుండడం భారత్‌ను కలవరపరుస్తోంది.**



కార్డిఫ్: ఇంగ్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్ తొలి మ్యాచ్‌లో ఘనవిజయం సాధించిన టీమ్‌ఇండియా.. సిరీస్ లక్ష్యంగా రెండో వన్డేలో బరిలోకి దిగుతోంది. గురువారం కార్డిఫ్‌లో ఈ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌కు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అందుబాటులో ఉంటాడా లేదా అన్న దానిపై స్పష్టత లేదు. తొలి వన్డేలో 80 పరుగుల కీలక ఇన్నింగ్స్ ఆడిన గిల్.. తొడ కండరాలు పట్టేయడంతో మైదానాన్ని వీడాడు. మళ్లీ అతను బ్యాటింగ్‌కు రాలేదు. అతను పెవిలియన్‌కు వెళ్లేపుడు ఇబ్బందిపడ్డ తీరును గమనిస్తే.. రెండో వన్డేలో ఆడడం సందేహంగానే కనిపిస్తోంది. గిల్ ఆడేది లేనిది మ్యాచ్ రోజే తేలుతుంది. శుభ్‌మన్ అందుబాటులో లేకపోతే వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్ జట్టుకు నాయకత్వం వహిస్తాడు.

**ఆ ఇద్దరి మెరుపులు చూస్తామా?:** తొలి వన్డేలో టీమ్‌ఇండియా గెలిచినప్పటికీ.. ఎన్నో అంచనాలతో బరిలోకి దిగిన సీనియర్ బ్యాటర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ విఫలమవడం మాత్రం అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేసింది. క్రీజులో ఉన్నంతసేపు తీవ్రంగా తడబడ్డ హిట్‌మ్యాన్ 21 బంతుల్లో 11 పరుగులే చేసి వెనుదిరిగాడు. కోహ్లి 5 పరుగులకే ఔటయ్యాడు. వీరి వైఫల్యంతో జట్టు బాగా ఒత్తిడిని ఎదుర్కొంది. అయితే శ్రేయస్ అయ్యర్‌తో కలిసి కెప్టెన్ గిల్ కీలక భాగస్వామ్యంతో జట్టును రక్షించాడు. మరి రో-కో రెండో వన్డేలో అయినా స్థాయికి తగ్గ ప్రదర్శన చేస్తారేమో చూడాలి. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ ఆడాలనుకుంటున్న ఈ ద్వయానికి ప్రతి సిరీస్ పరీక్షే. కుర్రాళ్ల నుంచి గట్టి పోటీ ఉన్న నేపథ్యంలో నిలకడగా రాణిస్తూ తమ స్థానాలపై ప్రశ్నలు తలెత్తకుండా చూసుకోవాల్సిన అవసరం వారికుంది.


తొలి వన్డేలో నిరాశపరిచిన మరో సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ కూడా పెద్ద స్కోరు చేయాల్సిన అవసరముంది. ఆ మ్యాచ్‌లో శ్రేయస్ అయ్యర్‌తో పాటు స్పిన్ ఆల్‌రౌండర్లు వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ విలువైన ఇన్నింగ్స్ ఆడారు. ఈ ముగ్గురూ రెండో మ్యాచ్‌లో ఎలాంటి ప్రదర్శన చేస్తారో చూడాలి. బర్మింగ్‌హామ్‌లో భారత బౌలర్ల ప్రదర్శన గొప్పగా సాగింది. పేసర్లు బుమ్రా, ప్రసిద్ధ్, గుర్నూర్ బ్రార్ చక్కగా బౌలింగ్ చేశారు. స్పిన్నర్ అక్షర్ కూడా అదరగొట్టాడు. కాకపోతే వంద పైచిలుకు పరుగులకే 6 వికెట్లు తీసిన బౌలర్లు.. మధ్యలో పట్టు విడిచి దాదాపు 260 స్కోరు చేయనిచ్చారు. ఈ బలహీనత పునరావృతం కాకుండా చూసుకోవాలి.

**కసితో ఇంగ్లాండ్:** టీ20ల్లో తిరుగులేని ఆధిపత్యం చలాయించాక తొలి వన్డేలో కంగుతిన్న ఇంగ్లాండ్.. ఓడితే సిరీస్ చేజారే రెండో మ్యాచ్‌లో కసిగా ఆడుతుందనడంలో సందేహం లేదు. బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న ఇంగ్లాండ్ మంగళవారం అనూహ్యంగా తడబడింది. కానీ డకెట్, బెతెల్, బట్లర్, బ్రూక్, రూట్, జాక్స్, సామ్ కరన్, డాసన్‌లతో కూడిన ఇంగ్లిష్ బ్యాటింగ్‌ను తక్కువగా అంచనా వేయలేం. 107 పరుగులకే 6 వికెట్లు కోల్పోయినా.. 250 స్కోరు దాటడం ఇంగ్లాండ్ నైపుణ్యానికి సూచిక. ఆర్చర్, టంగ్, కరన్, రషీద్‌లతో ఇంగ్లిష్ జట్టు బౌలింగ్ కూడా బలంగానే ఉంది.



రోష్నీ వాలియా అద్భుతమైన చీరకట్టు లుక్

# మహేష్ గ్లోబల్ జర్నీ తో టాలీవుడ్ మరో మెట్టు పైకి!





వర్షపు చినుకులతో తడిసిన తెల్లని దుస్తుల్లో షామా సికందర్ రూపం ఎంతో హుందాగా ఉంది.

తెలుగు చిత్రసీమ దశాబ్దాలుగా ఎన్నో మార్పులకు లోనవుతున్నా? ప్రస్తుత తరుణంలో సూపర్ స్టార్ మహేష్ చేపట్టిన గ్లోబల్ జర్నీ టాలీవుడ్ స్థాయిని మరో మెట్టు పైకి ఎక్కిస్తుందన్నది కాదనలేని నిజం. ఒక ప్రాంతీయ స్టార్‌గా కాకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సినిమాలను ఎంచుకోవడం ద్వారా మహేష్ పరిశ్రమ గమనాన్ని మారుస్తున్నారు. రాజమౌళి - మహేష్ కాంబినేషన్ లో తెరకెక్కుతోన్న గ్లోబల్ ప్రాజెక్ట్ -వారణాసి- ప్రపంచ సినిమా పటంలో తెలుగు సినిమాకు ప్రత్యేక స్థానాన్ని కల్పిస్తుంది. మహేష్ లో ఉన్న సహజ సిద్ధమైన హాలీవుడ్ స్టార్ ఫీచర్స్ అదనపు బలాన్ని ఇస్తున్నాయి. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ యాక్షన్ హీరోగా మాత్రమే కాకుండా ప్రపంచ స్థాయి నటుడిగా కనిపించే పరిణతి, గ్లోబల్ ఆడియెన్స్‌ను ఆకట్టుకోవడానికి ప్లస్‌గా మారుతున్నాయి. మహేష్ బాడీ లాంగ్వేజ్, ఫ్యాషన్ సెన్స్ కెమెరా ముందు ప్రదర్శించే హావభావాలు హాలీవుడ్ సినిమాల్లో కనిపించే స్థాయి నటనకు ఏమాత్రం తక్కువ కాదని చెప్పొచ్చు. ముఖ్యంగా జర్మనీ వంటి దేశాల్లో కఠినమైన శిక్షణ తీసుకోవడం, సినిమా కోసం తనను తాను పూర్తిగా మార్చుకోవడం వంటివి మహేష్ అంకితభావాన్ని చాటుతున్నాయి. నటుడిగా తన పరిధిని విస్తరించుకోవాలని మహేష్ చేస్తున్న ప్రయత్నం టాలీవుడ్ లో మిగతా స్టార్ హీరోలకు కూడా ఓ కొత్త దారిని చూపి స్తోంది.ఇలాంటి క్రమశిక్షణతో కూడిన ప్రయాణం భవిష్యత్తులో మరింత మంది స్టార్ హీరోలు అంతర్జాతీయ వేదికలపై స్థిరపడటానికి మార్గదర్శకంగా నిలుస్తుంది. గ్లోబల్ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకుని సినిమాలు రూపొందించడం తో టాలీవుడ్ సినిమాల బడ్జెట్ .. సాంకేతిక ప్రమాణాలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. మహేష్ ఎంచుకుంటున్న కథాంశాలు కేవలం ఒక వర్గానికి పరిమితం కాలేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు ఆకట్టుకునేలా ఉంటున్నాయి. ఇది తెలుగు నిర్మాతలు, దర్శకులు , సాంకేతిక నిపుణులకు అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకోవడానికి గొప్ప వేదికను అందిస్తోంది.ఈ మార్పు తో టాలీవుడ్ చిత్రాలకు దక్కుతున్న ఆదరణ బాక్సాఫీస్ వసూళ్లను మాత్రమే కాకుండా పరిశ్రమ గౌరవాన్ని కూడా పెంచుతోంది. గ్లోబల్ స్థాయిలో తెలుగు సినిమాలకి వస్తున్న గుర్తింపు భారతీయ సినిమా వైపు ప్రపంచం చూసేలా చేస్తోంది. మహేష్ లాంటి గ్లోబల్ ఐకాన్ లీడ్‌లో ఉండటం వల్ల అంతర్జాతీయ పంపిణీదారులు .. థియేటర్ల యజమానులు చిత్రాలను ప్రదర్శించడానికి ముందుకొస్తున్నారు. -వారణాసి- ప్రపంచ వ్యాప్తంగా 120 దేశాల్లో విడుదల చేస్తోన్న తీరు..రాజమౌళి గ్లోబల్ ఇమేజ్ తోనే ఇదంతా సాధ్యమవుతుంది.

చివరిగా మహేష్ గ్లోబల్ జర్నీ టాలీవుడ్ కు కొత్త శకాన్ని పరిచయం చేస్తోంది. ఆయనలోని స్టార్ ఫీచర్స్ , ప్రపంచ స్థాయి కథాంశాల కలయిక తెలుగు సినిమాను గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద విజేతలుగా నిలబెడుతుంది. రాబోయే రోజుల్లో మహేష్ ప్రాజెక్టులు తెలుగు సినిమా స్థాయిని ఎలా? అంతర్జాతీయ శిఖరాలకు చేరుస్తాయో వేచి చూడాలి.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com